చింతామణి.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨] రాజమహేంద్రవరము: నందన సంవత్సర పుష్యమాసము. [సంచిక ౭.

కృ తి వి మ ర్శ న ము.


హరిశ్చంద్ర నలోపాఖ్యానము— శ్రీ వసుచరిత్ర కృతికర్తయగు రామరాజభూషణునిచే రచియింపఁబడినదియు వ్యాఖ్యాన సహితముగా శ్రీమదముద్రిత గ్రంథ చింతామణి పత్రికాధిపతులగు బ్రహ్మశ్రీ పూండ్ల రామకృష్ణయ్యగారిచే వ్రాయఁబడిన పీఠికతోడఁగూడ ముద్రింపఁబడినదియు నగు హరిశ్చంద్ర నలోపాఖ్యాన ద్వ్యర్థికావ్యము యొక్క ప్రథమాశ్వాసమును జదివి యానందించినాము. వసుచరిత్ర గ్రంథకర్తవంటి మహాకవిచే రచియింపఁబడిన కావ్యమునుగూర్చి మా యభిప్రాయము వ్రాయుట యనావశ్యకము. రామరాజభూషణుఁడు మృదుమధురపద భూయిష్ఠముగాను నానావిధచమత్కారాలంకార బంధురముగాను కవిత్వము చెప్పుటయందసమాన సామర్థ్యముగలవాఁడు. ఈ కావ్యము మొదటినుండియుఁ గడపటికును శ్లేషప్రధానమయినదగుటచేతఁ గొన్నిచోట్ల రసపుష్టి యంతగాఁ గలుగకపోయినను మొత్తముమీఁద శ్లేషకావ్యముండఁ గలిగినంత రసవంతముగా నున్నదనుటకు సందేహము లేదు. ఈ గ్రంథము బహు విషయములయందు రాఘవపాండవీయమునకుఁ జాలదని పలువుర యభిప్రాయము. రాఘవపాండవీయమును రచించి మొట్టమొదట తెలుఁగునందు శ్లేషకావ్యములకు దారితీసినవాఁడన్న హేతువుచేత నేకాక సమస్తవిధముల చేతను పింగళి సూరనార్యుని కవిత్వము శ్లాఘాపాత్రమయినదనుట కణుమాత్రమును సందేహము లేదు. అయినను హరిశ్చంద్ర నలోపాఖ్యానము కూడఁ గొన్ని విషయములయందు రాఘవపాండవీయమునకుఁ దీసిపోయినను గొన్ని విషయములయందు దానిని మించియున్నదని చెప్పవచ్చును. పూండ్ల రామకృష్ణయ్యగారు శ్రమపడి కొంత గ్రంథశోధన చేసి దీనికి మంచిపీఠికను వ్రాసియున్నారు. పడిన ప్రయాసమునకుఁ బ్రతిఫలము కలుగునట్లుగా సర్వకళాశాలాధ్యక్షులు దీనిని ౧౮౯౪ వ సంవత్సరపు పట్టపరీక్షకు పఠనీయగ్రంథమునుగా నిర్ణయించినందున కెంతయు సంతోషించుచున్నాము. ఇట్లు పరీక్షకుఁ బెట్టఁబడిన గ్రంథము నిర్దుష్టముగా నుండుట యావశ్యకము. ఇప్పుడు ముద్రింపఁబడిన గ్రంథమునందు స్ఖాలి

త్యము లనేకములు కానవచ్చుచున్నవి. విద్యార్థులు తప్పులొప్పులనుగా నెంచి భ్రమ పడకుండుటకయి శుద్ధపత్రము నొకదానిని వెంటనే ప్రకటించుట సముచితముగా నుండునని భావించుచున్నాము. ఉదహరించు, జనకతండ్రి, పాలకతండ్రి, వ్యాఖ్యాతృనకు, లేకనే, నిరసించేబాగు, బహుమాటలు, తనకునివ్వఁగా, చాల్గావినుట, మించకుండా, మొదలుగాఁగల వ్యాకరణదుష్టములయిన ప్రయోగము లనేకము లీ ముద్రిత పుస్తకమునందు గోచరించుచున్నవి.

ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసము— శ్రీసు దముద్రిత గ్రంథ చింతామణీ పత్రికాధిపతులగు బ్రహ్మశ్రీ పూండ్ల రామకృష్ణయ్యగారిచే వ్రాయఁబడిన పెద్దపీఠికతోడఁగూడ ముద్రింపఁబడిన యీ గ్రంథము మాకార్యస్థానమును జేరినది. కృతికర్తయైన గణపవరపు వేంకటకవి యీ గ్రంథ రచనమునం దెంతో కష్టపడియున్నాఁడు. పూర్వకవు లెవ్వరు నొక్క గ్రంథమునందుఁ జెప్పఁబ్రయత్నింపని వివిధములయిన బంధములు మొదలయినవాని నీకవి బహుప్రయాసపడి యీ యేకాశ్వాసగ్రంథమునందుఁ జేర్చియున్నాఁడు. ఇది బంధగర్భకవిత్వములకును చిత్రకవిత్వమునకును లక్ష్యగ్రంథముగా నుద్దేశింపఁబడినదగుటచేత దీనిని జేయుటయందు కవి యెంతకష్టపడినను, పడినశ్రమమును విచారించి రసికు లెంతయాశ్చర్యపడినను, దీనిని జదువువారికి మాత్రము కథాచమత్కృతినిబట్టికాని రసపుష్టిని బట్టికాని కలుగవలసిన యానందము కలుగదు. ఇటువంటి గ్రంథములనుజూచి సంతోషించెడు కాలము పోవుచున్నది. ఇప్పుడు హృదయాహ్లాదకరముగా నర్థకల్పనము చేయుటయందును శ్రోత్రపేయముగా మృదుమధురవాక్యములను గూర్చుటయందును స్వభావవిరుద్ధములు గాకుండ వస్తువర్ణనలు చేయుటయందును చిత్తాకర్షకముగా నీతిజ్ఞానపోషణము చేయుటయందును కవి సమర్థుఁడగునా కాఁడాయన్న యంశము ముఖ్యముగా విచారింపఁబడునుగాని కవి పద్యములోఁ బద్యమును దూర్చినాఁడా, యేకాక్షరముతోనే పద్యమంతయు నింపినాఁడా, పద్యములోని యక్షరములను ఖడ్గాది క్రమమున నమర్చి కూర్చినాఁడా, యన్న యంశమంతగా విచారింపఁబడదు. కాఁబట్టి యిట్టి గ్రంథములు గ్రంథకర్త యతికష్టపడెనని యద్భుతపడి సంతోషించుటచే చరితార్థములు కావలసినవే కాని యుపయుక్తములైనవి గావు. ఈ పుస్తకమునకు పీఠిక వ్రాయుటలో రామకృష్ణయ్యగారు నరసభూపాలీయము మొదలయిన బహుగ్రంథములను పరిశోధించి వానిలోని పద్యములతోడ నీ ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసములోని పద్యములను బోల్చి మిక్కిలి శ్రమపడియున్నారు. ఈగ్రంథము చిత్రగర్భ బంధకవిత్వములయం దాదరముగల యెల్లవారిచేతను చదువఁదగి యానందింపఁ దగియున్నది.

:0:


నీతికథలు.



ఏదుపందియు పాములును.

ఒకగుహలో పాములనేకములువసించుచుండఁగా, ఏదుబందియొకటి యక్కడకువచ్చి తాను విశ్రాంతిపొందుటకు కొంచెము తావిండని వేడుకొనెను. ఆపాములు కొంచెమొత్తిగిలి యిక్కడనుండుమని దానికొకమూల కొంచెము చోటిచ్చెను. ఆ యేదుబంది లోపలప్రవేశించిన తరువాత మెల్లమెల్లగా లోపలికి జరగి పాములమీఁదికి రానారంభించెను. ఏదుపంది ముండ్లుగ్రుచ్చుకొన మొదలుపెట్టినందున సహింపలేక యాపాములు దానినావలికి పొమ్మనియడిగెను. అప్పుడాయేదుబంది పాములను లక్ష్యముచేయక యీగుహలో తనకేమియు నిబ్బంది లేక సుఖముగానేయున్నదనియు, ఎవ్వరికిబ్బందిగానున్నదో వారేగుహనువిడిచి మఱియొకచోటు చూచుకొనుట యుచితముగా నుండుననియు, చెప్పి, ముండ్లుగ్రుచ్చుకొనునట్లుగా మఱింతమీఁదికి జరగసాగెను. అప్పుడాపాములు మొట్టమొదట దానికి తావిచ్చినందుకు పరితాపపడవలసివచ్చెను.

గీ॥ నరులు బ్రతిమాలుకొని తొల్త నొరులచెంతఁ
జేరి పిదప వారికె కీడుచేయుచుంద్రు;
కావునను బుద్ధిమంతులు కన్నుగలిగి
దుష్టులను జెంతఁజేర్పక తొలఁగవలయు.



సింహము.

ధైర్యమునందు మిక్కిలి ప్రసిద్ధికెక్కి మృగరాజని పేరొందిన యొక సింహ మొకనాఁడరణ్యములో తిరుగుచు నొక గుహ చెంత నిలుచుండి గర్జనము చేసెను. అప్పుడాగర్జనము గుహయందు మాఱుమ్రోయఁగా సింహమాశ్చర్యపడి యెవ్వరో తన్నుఁజూచి గర్జించుచున్నారనుకొని రోషముతో "అట్లు గర్జనము చేసిన నిర్భాగ్యుఁడెవ్వఁడు?" అని కేకవేసెను. ఆమాటలే మరల గుహలోనుండి ప్రతిధ్వనిగా బయలుదేరెను. అందుమీఁద సింహమునకు మఱింతకోపమువచ్చి "నీవెవ్వఁడవు?" అనియఱచెను. గుహలోనుండి మరల "నీవెవ్వఁడ" వన్నయఱపు బిగ్గఱగా వినఁబడెను. నేనెవ్వఁడనో కనఁబఱచెదను యుద్ధమునకురమ్మని సింహము ముందుకు నడిచెను. అప్పుడామాటలె గుహలోనుండి సింహమునకు మఱింతదగ్గఱగా వినఁబడెను. అందుమీఁద సింహము తనకంటె గొప్పశత్రుఁడెవ్వఁడో వచ్చి తన్నెదిరించుచున్నాఁడనుకొని యేమియుతోఁచక యాలోచించుచు నిలువఁబడెను. జరిగినదంతయు వినుచున్న యొకనక్క చేరువపొదలోనుండి లేచివచ్చి "ఓమహారాజా! మీరిప్పుడువిని భయపడినది మీధ్వనియేకాని మీశత్రువుది కాదు" అని నవ్వుచు చెప్పి మృగరాజుయొక్క భయమును తీర్చెను.

గీ॥ జనులు భయకారణములేక జగతిలేని
యాపదలనూరకూహించి యడలుచుంద్రు;
ధీరుఁడల్పకారణముల దిగులుపడక
నిలిచి సత్కార్యములఁబూని నిర్వహించు.

(౨౭౬-పుట శేషము.)

ది హానరెబిల్ సర్ తిరువారూర్ ముత్తుసామి అయ్యర్, కె. సి. ఐ. ఇ.

ది హానరెబిల్ సర్ తిరువారూర్ ముత్తుసామి అయ్యర్ బి. యల్ అండు సి. ఐ. ఇ. గారు ౧౮౩౨ సంవత్సరము జనవరు ౨౮వ తేదీని తంజావూరుజిల్లా వుచ్చువాడి గ్రామములో జననమొందిరి. ఆయన తండ్రి వేంకటనారాయణ శాస్త్రిగారు మిగుల ఘనతకెక్కిన కుటుంబములోఁ జేరినవారై యుండిరి. ఈయనకు సుమారెనిమిది వత్సరముల ప్రాయము రాకపూర్వమే తండ్రిగారికి నేత్రావరోధము సంభవించినందునఁ గుటుంబ భారమంతయు నీయనయు, ఈయనకంటె నాలుగు సంవత్సరములు పెద్దవాఁడగు సోదరుఁడును వహించవలసి వచ్చెను. తంజావూరు జిల్లాలో నొకధనవంతుని కొమార్తెయగు వీరితల్లిగారు కుమారుల విద్యాభ్యాసమునకయి తిరువారూరు పట్టణమును చేరెను. తల్లిగారి సంరక్షణలోనుండి ముత్తుస్వామి అయ్యరుగారు అరవభాషయందు విద్యనేర్చి తిరువారూరు తాలూకాకచేరీలో నట్టుకరణము (తాలూకా అక్కౌంటెంటు) నొద్ద పని నేర్చుకొనుచుండెను. ముత్తుస్వామి అయ్యరుగారికి పదునాలుగేండ్ల ప్రాయమునందు తల్లిగారు పరలోకగతులైరి. ఆమె యొక్క బోధనవలన విద్యాభివృద్ధి చేసికొనవలెనను తలంపు ముత్తుస్వామి అయ్యరుగారికి చిన్నతనమునందే కలిగెను. తల్లిగారి మరణమువలనను తండ్రిగారి యంధత్వము చేతను కొంతకాలమువరకు ముత్తుస్వామి అయ్యరుగారు విద్యాకృషి మానవలసివచ్చెను. అందుచేత కరణముదగ్గిర గుమాస్తాగానుండెను. ౧౮౪౬వ సంవత్సరమునందు సర్ హెన్రీ మంగామరీగారికి మిత్రులగు ముత్తుస్వామి నాయర్‌గారు తిరువారూరుకు తహశ్శీల్దారుగా నియమింపఁబడెను. ఆయన అయ్యర్‌గారియొక్క బుద్ధికుశలతయు, విద్యాసక్తియుఁ గనిపెట్టి కరణపుగుమాస్తాపని మానివేసి నాగపట్టణపు మిషన్ పాఠశాలలోఁ బ్రవేశించుమని అయ్యరుగారితో సెలవిచ్చెను. ఈ ఘనమైన పురుషుని దాతృత్వసహాయముచే ముత్తుస్వామి అయ్యరుగారు నాగపట్టణ పాఠశాలలో నాంగ్లేయవిద్య నభ్యసించి యొకసంవత్సరమయినతరువాత లేటు మదారాస్ హైస్కూలులోను పిమ్మట రాజకీయ శాస్త్ర పాఠశాలలోను విద్యను ముగించిరి. పాఠశాలలోఁ జదువుచున్నప్పుడు మంగామరీగారు అయ్యరుగారి క్షేమము నారయుచు మిగుల శ్రద్ధతోఁ గాపాడుచుండిరి. విద్యార్థిగా నున్నప్పుడు తంజావూరు

కలెక్టరుగారగు బిషప్ దొరగారును, రాజా సర్ టి మాధవరావు కె. సి. యస్. ఐ. గారును హరిరావుగారును అయ్యరుగారికి మిగుల సహాయముఁ జేసిరి.

మదరాస్ హైస్కూలు ౧౮౫౪వ సంవత్సరమునందు రాజకీయ శాస్త్రపాఠశాలగా నేర్పరుపఁబడినప్పుడు ముత్తుస్వామి అయ్యరుగారు భాషా పరిజ్ఞానములో ప్రథమతరగతి యోగ్యతాపత్రిక (Certificate) నంది యేటేట లార్డు యెలిఫిన్‌స్టన్ ప్రభువుగారిపేర నాంగ్లేయభాషలో నుపన్యాసములు చక్కఁగ వ్రాయు విద్యార్థుల కియ్యఁబడు బహుమతి నందుకొనెను. రాజధానియొక్క యన్నిభాగములనుండి వచ్చిన విద్యార్థులను విద్యా విషయవిచారణసఘమువారు చేసిన పరీక్షలో అయ్యరుగారు మొదటివారుగాఁ గృతార్థులయి ౫౦౦ రూపాయల విశేషబహుమతి నందుకొనిరి. ఆయన రాజకీయోద్యోగములో నెట్టిదానికైనను సమర్థులని ఫోర్టుసెంటు జార్జి గెజెటులో ప్రచురముచేసిరి. ఆకాలములోఁ బరీక్షకులలో నొకరగు హాలొవె దొరవారికిని హైస్కూలు విద్యావిచారణ సంఘమునకుఁ గార్యదర్శిగారయిన సర్ అలెగ్జాండర్ అర్‌బత్‌నట్ గారికిని అయ్యరుగారియందు మిగుల దయపుట్టెను. ఆ సమయమునందు రాజకీయ శాస్త్రపాఠశాలయందుఁ బ్రధానోపాధ్యాయులగు పవల్ దొరవారు ముత్తుస్వామి అయ్యరుగారిని ఇంగ్లాండునకుఁబోయి సివిల్ సర్వీసు పరీక్షకుఁ జదువుకొనుట కిచ్చగలదాయని పృచ్ఛచేసిరి. కాని అయ్యరుగా రదివరకే గృహస్థాశ్రమమునందుఁ బ్రవేశించియుండుటచేతను, నావికాయాత్రవలన వర్ణసంకరమగునను భయముచేతను, అట్లుచేయుట కియ్యకొనరైరి. తరువాత సర్ హెన్రీ మంగామరీగారి కృపచే తంజావూరుజిల్లా కలెక్టరువారి కచేరీలో రికార్డుకీపరు పనికి నియమింపఁబడెను. పిమ్మట ౧౫౦ రూపాయల జీతముగల పాఠశాలాపరీక్షకపదము నొంది తమ పైయధికారి యయిన రివరెండు రిచ్చర్డు దొరవారి మెప్పువడసి వారి ద్వారా రాజధానియందలి విద్యావిషయోద్యోగులలోఁ బ్రధానుఁడగు సర్ అలెగ్జాండరు అర్‌బత్‌నట్ గారి దయకుఁ బాత్రుఁడయ్యెను. ఈయుద్యోగములోనుండి ముత్తుస్వామి అయ్యరుగారు బి. యల్. పరీక్షలోఁ గృతార్థులయి మదరాసు సర్వకలాశాలలో యోగ్యతాపత్రికను పొందినవారయిరి. అనంతరము డిస్ట్రిక్టు మునసఫుగా నియమింపఁబడి కొన్నిసంవత్సరములు పనిఁజేసెను. అప్పటి కాలములో మండలన్యాయస్థానాధిపతియగు బోసాంక్వుదొరగారు అయ్యరుగారి బుద్ధికుశలతకు మిగుల వెరగంది తానెరిగిన హిందువులలో నీయనను బోలినవా రెవరును లేరనియు తన పీఠముపైఁ గూర్చుండుటకుఁ దగినవాఁడనియు వ్రాసిచ్చిరి. చెన్నపురి రాజధానిలో

ఈనాముల విచారణసభ యేర్పరుపఁబడినప్పుడు అందలి యగ్రాసనాధిపతులగు జార్జి నోబిల్ టెయిలర్ దొరవారు అయ్యరుగారికిఁ దన క్రిందియుద్యోగము నొసఁగిరి. రెండుసంవత్సరము లాయుద్యోగములోనుండి తనజిల్లాలో రెండుతాలూకాలకు డిప్ప్యూటీకలెక్టరుగా నియమింపఁబడెను.

తంజావూరుజిల్లా డిప్ప్యూటీకలెక్టరుగా నుండి మిగుల ఖ్యాతిగాంచి మంగుళూరులో ప్రిన్సిపల్ సదరు అమీనుగా నియమింపఁబడి మూడు సంవత్సరములు పనిచేసెను. ఆకాలమం దాయన చేసినపని మిగుల శ్లాఘనీయమయినది. ఆయనయొక్క రాజకార్య నిర్వహణ నైపుణికి మెచ్చి మదరాసు పట్టణమునకు "నగర దండనాయకుని" గా నేర్పరచిరి. తరువాత మదరాసుస్మాల్‌కాజుకోర్టుకు న్యాయాధిపతిగా నియమింపఁబడి తన శక్తిసామర్థ్యములను విద్యానైపుణిని బయల్పరచి దొరతనమువారిచే మిగుల మెప్పునొంది ఆకాలమందు ౧౮౭౦వ సంవత్సరపు చట్టమునుబట్టి అయ్యరుగారిని డిస్ట్రిక్టుజడ్జిగా నియమించుటకు దొరతనమువారు నిశ్చయపరచిరి. శ్రీ మహారాజ్ఞీగారి చక్రవర్తిత్వమును ప్రచురించుట కేర్పరుపఁబడిన ఢిల్లీలోజరిగిన దర్బారుకు అయ్యరుగారిని ఆహ్వానము చేసిరి. తిరిగి వచ్చినతరువాత స్మాల్‌కాజుకోర్టులో ప్రధానాధిపత్యమునంది యొక సంవత్సరమువరకు పనిచేసిరి. అనంతరము హైకోర్టులో జడ్జీపనికి నియమింపఁబడి నేటివరకును ఆస్థానమందే యున్నవారు. వారిబుద్ధికుశలతయు, శక్తిసామర్థ్యములును, ప్రపంచమందంతటను తెలిసియేయున్నవి. ఈయన కుమారులగు స్వామినాథ అయ్యర్‌గారిప్పుడు హెడ్డు అసిస్టాంటు కలెక్టరుగా నుండి మిగుల ఖ్యాతి గాంచుచున్నారు. శ్రీ ముత్తుస్వామి అయ్యరుగారికి ౧౮౯౨వ సంవత్సరము నవంబరునెల ౨౯వ తేదీని ఇండియాదేశపు గవర్నరుజనరలుగారగు లార్డు లాండ్స్డవును ప్రభువుగారు చెన్నపురికి దయచేసినప్పుడు శ్రీ మహారాజ్ఞీ చక్రవర్తినిగారి యనుమతిప్రకారము కె. సి. ఐ. యి పట్టము నొసఁగి మిగుల గౌరవించిరి. ముత్తుస్వామి అయ్యరుగారి వయస్సు ఇప్పటికి అరవై సంవత్సరములు. ఘనతకెక్కిన ఈ మహాపురుషునికి దీర్ఘాయువును ఐశ్వర్యాభివృద్ధియు నొసంగుటకు భగవంతుని సదా ప్రార్థించుచున్నాము.

దాదాభాయి నౌరోజీ యమ్. పి.

ఆంగ్లేయ రాజ్యపరిపాలన సంఘసభలోని హిందూదేశపు ప్రతినిధులలో మొదటివాఁడగు దాదాభాయి నౌరోజీగారు బొంబయినగరములో ౧౮౨౫వ సంవత్సరము సెప్టెంబరు నెల ౪వ తేదిని జననమొందెను. ఆయనతండ్రిగారు పారసీకకులస్థులకు మతగురువు. కుమారునికి నాలుగు సంవత్సరముల ప్రాయములోనే తండ్రి మృతుఁడాయెను. పిల్లవానికి విద్యనేర్పుట మొదలుగాఁగల పనులన్నియు ఘనమయిన యంతరంగము కలిగినట్టియు, బుద్ధికౌశలము గలిగినట్టియు తల్లిగారే జరపవలసి వచ్చెను. తనసహోదరుని సహాయముతో నామె యార్జితము కుమారునికొరకే పాటుపడి, చిన్నవయసునందే ఎలిఫిన్‌స్టన్ శాస్త్రపాఠశాలలోఁ గుమారునిఁ బ్రవేశపెట్టెను. నౌరోజీగారు మిగుల పొట్టిమనిషి. ముఖము సుందరమయినది. తన యుపాధ్యాయులయెడల మిగుల వినయవిధేయతలతో సంచరించుచు వారిదయకుఁ బాత్రుఁడయి నౌరోజీగారు విద్యఁ గరచుచుండెను. కొద్దికాలములోనే శాస్త్రపరీక్షలలోఁ గడతేరి బహుమతుల నందుకొనుచు, విద్యావేతనములు గైకొని గణితశాస్త్రములోను, సృష్టిశాస్త్రము, రసవాదశాస్త్రము, రాజ్యతంత్రశాస్త్రము మొదలగువానిలోను మిగుల మెప్పువడసెను. అప్పటి దినములలో మండలన్యాయస్థానమునకుఁ బ్రధానాధ్యక్షులగు లేటు సర్ ఎల్ స్కిడ్ పెర్రిదొరవారు విద్యావిషయ పరిపాలనా సంఘమునకుఁగూడ నధ్యక్షులుగా నుండినందున నౌరోజీగారి బుద్ధికుశలతకు మెచ్చి ఆయనను న్యాయవాదిపరీక్షకై చదువుటకొరకు ఇంగ్లాండునకు పంపవలసినదనియు కావలసిన వ్యయములలో సగభాగము తామిచ్చెదమనియు సెలవొసంగిరి. కాని క్రీస్తుమతములో చేరునేమోయని భయపడి పారసీకులందరును అందులకియ్యకొనరైరి.

తరువాత కొద్దికాలమునకుఁ బాఠశాలలో నీయన కుపాధ్యాయపద మొసఁగిరి. శీఘ్రకాలములోనే సహోపాధ్యాయపదము నందుకొని వెంటనే గణితశాస్త్రములోను సృష్టిసంబంధమైన శాస్త్రములోను పండితుఁడుగా నియమింపఁబడెను. ఈదేశస్థులలో శాస్త్రపాఠశాలలో నట్టిపదమునందుకొనిన వారిలో నీయనయే మొదటివాఁడు. దేశాభివృద్ధికై తనయభిప్రాయములను వెల్లడిచేయుటకొరకు౧౮౫౧ సంవత్సరములో "రస్తుగఫ్‌తార్" అనువారపత్రికను బ్రచురించి ప్రకటింపమొదలుపెట్టెను. [సశేషము.]

ఆచంట- సుందరరామయ్య.

మున రాజ్యమునకు వచ్చిన యచ్యుతదేవరాయఁడు ౧౫౪౨ వ సంవత్సరమునందు మృతినొందెను. ఆకాలమునందు సదాశివదేవరాయఁడు పసివాఁడయినందున సలకము తిమ్మయ రాజ్యమును దా నాక్రమించుకొని కృష్ణదేవరాయల యల్లుఁడయిన రామరాజును రామరాజు తమ్ముఁడయిన తిరుమల దేవరాయని బట్టి చెఱలోఁ బెట్టవలెనని ప్రయత్నింపఁగా వారిద్దఱును పెనుగొండకు పాఱిపోయి యక్కడఁ గొంత సైన్యమును గూర్చుకొని తరువాత కందనూలురాజు మొదలగువారి సాహాయ్యమును బొంది విజయనగరము మీఁదికి దండెత్తివచ్చి సలకము తిమ్మయ నోడించి చంపి ౧౫౪౨ వ సంవత్సరమునకు సరియైన శుభకృత్ సంవత్సర జ్యేష్ఠమాసమునందు బాలుఁడయిన సదాశివరాయని సింహాసన మెక్కించిరి. ఈకార్యమువలన రామరాజు సదాశివరాజ్య సంస్థాపకుఁడని పేరుపొంది, పేరునకు సదాశివరాయఁడే రాజయినను నిజమయిన యధికారమునంతను దానే వహించి రాజ్యపరిపాలనము చేయుచుండి ౧౫౬౪ వ సంవత్సరమునందు మహమ్మదీయరాష్ట్రములవారి సేనతో తళ్ళికోటవద్ద జరగిన యుద్ధమునందుఁ జంపఁబడెను. అప్పుడు మహమ్మదీయప్రభులు విజయనగరమునందుఁ బ్రవేశించి యనేక క్రూరకృత్యములనుజరపి రాజ్యమంతయు పాడుచేసి తమలోఁదమకు సంభవించిన కలహమువలన రాజ్యమును పూర్ణముగా నాక్రమించుకొనక వెడలిపోయిరి. తరువాత నయిదు సంవత్సరములవఱకు రాజ్యమించుమించుగా నరాజకము కాఁగా నీలోపల ౧౫౬౭ వ సంవత్సరప్రాంతమున సదాశివరాయఁడు స్వర్గస్థుఁడయ్యెను. ఆసంవత్సరమునందే తిరుమలదేవరాయఁడు విజయనగరమునువిడిచి పెనుగొండఁజేరి తాను రాజునని ప్రకటించి ప్రమోదూత సంవత్సరములోనఁగా ౧౫౬౯ వ సంవత్సరమున పెనుగొండ రాజ్యమునందు స్థిరపడి ౧౫౭౨ వ సంవత్సరమునందు లోకాంతరగతుఁడయ్యెను. ౧౫౭౨ వ సంవత్సరమునకు సరియైన అంగిరస సంవత్సర వైశాఖ శుద్ధదశమినాఁ డాతని పుత్రుఁడయిన శ్రీరంగరాయలు రాజ్యమునకువచ్చి ౧౫౮౫ వసంవత్సరమువఱకును రాజ్యము చేసి స్వర్గస్థుఁడయ్యెను. ౧౫౮౫ వ సంవత్సరమునకు సరియైన పార్థివ సంవత్సర మాఘశుద్ధదశమినాఁ డాతని తమ్ముఁడయిన వేంకటపతిరాయఁడు సింహాసనమునకు వచ్చినతఁడే తనరాజధానిని పెనుగొండనుండి చంద్రగిరికిమార్చి ౧౬౧౪ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసి సంతానహీనుఁడయి పరమపదమును బొందెను. నంద్యాలరాజయిన కృష్ణరాజు సదాశివదేవరాయని కాలములోనివాఁడయినందున, ఆతని రాజ్యకాలము ౧౫౬౪ వ సంవత్సరమునకు లోపల నారంభమయియుండును. కాఁబట్టి పింగళిసూరన్న నంద్యాల సంస్థానమునందుండి కృష్ణరాజునకుఁ గళాపూర్ణోదయము నంకితము చేసినకాల మించుమించుగా ౧౫౬౦ వ సంవత్సరప్రాంత

మని చెప్పవచ్చును. ఈసదాశివదేవరాయఁ డచ్యుతదేవరాయని కుమారుఁడయినట్టు కొన్ని శిలా తామ్రశాసనములయందుఁ జెప్పఁబడినదిగాని కృష్ణామండలములోని సత్తెనపల్లె తాలూకాలో దొరకిన శాలివాహనశకము ౧౪౮౧ సిద్ధార్థి సంవత్సరమునకు సరియైన హూణశకము ౧౫౬౦వ సంవత్సరపు సదాశివరాయల తామ్రశాసనములో నతఁడు రంగరాజునకును తిమ్మాంబకును బుత్రుఁడయినట్టును రామరాజునకు మఱఁదియైనట్టును ఈక్రిందిశ్లోకముచేఁ జెప్పఁబడినది—

"తిమ్మాంబా వరగర్భ మౌక్తికమణీ రంగక్షితీం ద్రాత్మజః
అత్రాలంకరణేన పాలితమహా కర్ణాట రాజ్యశ్రియా
శౌర్యౌదార్య దయావతాస్య భగినీ భర్త్రాజగత్రాయిణా
రామాఖ్య ప్రభుణాప్యమాత్య తిలకైః కృష్ణాభిషేక క్రమః"

ఈశ్లోకమునందలి రంగక్షితీంద్రుఁడన్నది ప్రమాదజనితమేమో! నంద్యాలకృష్ణరాజు వేంకటపతిరాయల రాజ్యారంభదశలోను జీవించియున్నాఁడఁట. అందుచేత నతఁడు ౧౫౮౫వ సంవత్సరమునకుఁ దరువాతకూడ నల్పకాలము రాజ్యమేలి యుండవచ్చును.

మఱియును కళాపూర్ణోదయములో కృష్ణరాజు తాతయయిన నారపరాజును వర్ణించుచో నతఁడు కుతుబ్‌మల్కును కొండవీటివద్ద నోడించిన ట్లీక్రిందిపద్యమునందుఁ జెప్పఁబడినది—

చ॥ వదలక యుత్కళేంద్రుని సవాయి బరీదునడంచు గర్జయుక్
గుదుపనమల్కుఁ దల్లడిలఁగొట్టె మహోన్నత సంగరంబులో
నెదిరిచి కొండవీటికడ నెవ్వరుసాటి విచిత్రశౌర్య సం
పదపసనారసింహ విభుపట్టికి నారనృపాలమౌళికిన్.

గోలకొండయందు కుతుబ్‌షావంశరాజ్య సంస్థాపకుఁడయిన యీకుతుబ్‌మల్కు క్రీస్తుశకము ౧౫౧౨ వ సంవత్సరము మొదలుకొని ౧౫౪౩ వ సంవత్సరమువఱకును గోలకొండయందు రాజ్యము చేసెను. కృష్ణదేవరాయని కాలములో కొండవీటివద్ద జరగిన యీయుద్ధము ౧౫౧౫ వ సంవత్సరమునందగుటచేత నాతనితో యుద్ధము చేసిన నారపరాజు మనుమఁడయిన కృష్ణరాజటుతరువాత ముప్పది నలువది సంవత్సరములయిన పిమ్మట రాజ్యముచేసెననుట సత్యమునకు దూరమయి యుండదు. కాఁబట్టి దీనినిబట్టియు సూరకవి ౧౫౬౦ వ సంవత్సర ప్రాంతములయందున్నట్లు నిశ్చయింపవలసియున్నది. ఈవిషయమునే రాఘవపాండవీయములోని కృతిపతి వంశానువర్ణనమునుండియు నొకవిధముగా నూహింపవచ్చును. రాఘవపాండవీయము కర్నూలుమండలములోని యాకుపీటి సంస్థానాధిపతియైన పెదవేంకటాద్రి కంకితము చేయఁబడినది. ఆకుపీడు కోవిలకుంటకు పడమట నాలుక్రోసుల దూరములో తుంగ

భద్రా తీరమునందున్నది. అందు విరూపాక్షస్వామి దేవాలయమున్నది. ఈ వేంకటాద్రియొక్క తాతయయిన యిమ్మరాజు రాజమహేంద్రవరమును జయించినట్లీ క్రిందిపద్యమువలనఁ దెలియవచ్చుచున్నది —

క॥ రాజమహేంద్రవరాధిపు । రీజైత్రవిచిత్రములఁ బరిభ్రాజితుఁడై
యాజిఘనుండాయిమ్మన । హీజానిప్రసిద్ధిఁగాంచె నెంతయు మహిమన్.

రాఘవపాండవీయ కృతిపతితాతయయిన యీయిమ్మరాజును, కళాపూర్ణోదయ కృతిపతితాతయయిన నారపరాజును, కృష్ణదేవరాయని కాలములో నాతనికి లోఁబడిన సామంతరాజులయియుండి, ఆతనితోఁగలిసి సేనాధిపతులుగా మహమ్మదీయులు మొదలయినవారితో యుద్ధము చేసిరని తెలియవచ్చుచున్నది. కృష్ణదేవరాయనికి సహాయులుగానున్నవారిని వర్ణించిన కృష్ణరాజవిజయములోని యీక్రిందిపద్య మీసంగతిని కొంత స్థాపించుచున్నది.—

సీ॥ కోటలు దుర్గముల్ గొనుచుదోఃపటుబల ఘాటిచేమించు నార్వీటివారు
కంటకాహితకంఠ లుంటనోద్ధతలీల దంటలైతగుతొరగంటివారు
నిబ్బరంబుగ శత్రునికరంబు నడఁగించి ధీరులైమించు గొబ్బూరివారు
చాలదోర్బలలీల సరదారిసంఘంబుఁ దూలించివెలయు నంద్యాలవారు
నాదిగాఁగల్గురాజులు మేదురగతిఁ । దుళువగొరలును బోయలుమరుసుగాఁగఁ
బ్రతిదినంబును ఘోరమౌ రణమొనర్ప నిలిచిపోరాడె గజపతిబలములపుడు.

౧౫౧౫ వ సంవత్సరమునందు కృష్ణదేవరాయలు రాజమహేంద్రవరమును జయించెను. కాఁబట్టి యిమ్మరాజా కాలమునం దాతనితో నుండియుండును. దీనినిబట్టి చూచినను సూరనార్యుని కాలము పయినిచెప్పఁబడినదే యయియుండవలెను. ఈ యాకుపీటిరాజులు విజయనగర రాజులకు లోఁబడినవారయినందుకు నిదర్శనముగా రాఘవపాండవీయములోనుపోద్ఘాతములో నీక్రిందివాక్యము కానఁబడుచున్నది—

క॥ వడిగల తనాననీగిని । బడిముడిపనఁ బ్రాభవమున విజయనగరిలోఁ
గడునెన్న నేర్పఁగలమేల్ । నడకలఁజెవ వేంకటాద్రి నరవరుఁడొప్పన్.

ఈపద్యమునుబట్టి విజయనగర రాజ్యము చెడకముందనఁగా ౧౫౬౫ వ సంవత్సరమునకుఁ బూర్వమే రాఘవపాండవీయము రచియింపఁబడినదగుట నిశ్చయము.

కృష్ణదేవరాయని కాలములోనున్న ధూర్జటికవియొక్క మనుమఁడయిన కుమారధూర్జటి కృష్ణరాజవిజయమును రచించెను. అతఁడు కృష్ణరాజవిజయములోని యీరెండవ పద్యమునందు

సీ॥ జగదధిష్ఠాన భాస్వజ్జ్యోతియగువాఁడు బ్రహ్మాదులడరు దురాయివాఁడు
చలిగట్టుగాపట్టి సామేనఁగలవాఁడు చిలునవ్వువెన్నెల్ చిలుకువాఁడు

వాఁడువీఁడనక యెవ్వనినైనఁ బ్రోచువాఁ డఖిలదైవతగురుండైనవాఁడు
లీలమై శూలంబు కేలఁ బూనినవాఁడు నలమేని దొరతూపు గలుగువాఁడు
కలితపంపాతటంబున నలుచువాఁడు శ్రీవిరూపాక్షశివుఁడు రక్షించు నెప్పు
డఖిల సద్గుణమణిపేటి యాకువీటి। చిన్న వేంకటరాయని చెలువుమీఱ.

అని వర్ణించిన యీ చినవేంకటరాయఁడు రాఘవపాండవీయములో వర్ణింపఁబడిన కృతిపతి తమ్ముఁడయిన చినవేంకటాద్రియే యయినపక్షమున, ఈపద్యమును పయి కాలమును స్థిరపఱుచుచున్నది.

గ్రంథస్థములైన యీనిదర్శనము లటుండఁగా మఱియొక కట్టుకథకూడ వాడుకలోనున్నది. ఈసూరనార్యుఁ డల్లసాని పెద్దన్నమనుమరాలి భర్తయనియు, చిన్నతనములో నితఁడు చదువులేక మూఢుఁడై తిరుగుచుండుటచూచి యితనిని మాత్రమేకాక యీతని భార్యనుసహితము మూఢభర్తదారకెనని యెల్లవారును పరిహసించుచువచ్చిరనియు, అందుమీఁద సూరనకు రోషమువచ్చి దేశాంతరము పోయి చదువుకొని పండితుఁడయివచ్చి రాఘవపాండవీయమును చేయనారంభించె ననియు, అప్పుడాచిన్నది తనభర్తను వెంటఁబెట్టుకొని తాతగారియొద్దకుఁబోయి నీమనుమఁడు రాఘవపాండవీయమును జేయుచున్నాఁడని చెప్పఁగా నతఁ డందు లోని పద్యమునొకదానిని చదువుమనియడిగెననియు, అందుమీఁద సూరన "తలపం జొప్పడియొప్పెనప్పుడు" అని పద్యమును జదువనారంభింపఁగానే యల్లసానిపెద్దన యింతలోనే నాలుగు విఱుపులాయని యాక్షేపించెననియు, తరువాత సూరన పైభాగమునందుకొని "తదుద్యజ్జైత్ర యాత్రాసము।త్కలికారింఖద సంఖ్యసంఖ్యజ యవత్కంఖాణరింఖావిశృం।ఖల సంఘాత ధరాపరాగ పటలాక్రాంతంబుమిన్నేరన। ర్గళ ఖేరీరవ నిర్దళద్గగన రేఖాలేపపంకాకృతిజ॥" అని చదువఁగా మెచ్చుకొనె ననియు, చెప్పుదురు. ఈకథ యెట్టిదైనను సూరన కృష్ణదేవరాయని తరువాతికాలపు వాఁడైనట్టు స్థిరపఱుచుచున్నది. అల్లసాని పెద్దన కృష్ణదేవరాయని యనంతరమం దనఁగా ౧౫౩౦ వ సంవత్సరమునకు తరువాతకూడ జీవించియున్నందున, సూరనార్యుఁ డల్లసాని పెద్దన్న మనుమరాలిమగఁడయినను కావచ్చును. కళాపూర్ణోదయమును రచింపకపూర్వమునం దీకవి యాకువీటి రాజులవద్ద మొట్టమొదటనుండి రాఘవపాండవీయమును జేసి వారి కంకితము చేయుటచే రాఘవపాండవీయము నీకవి ౧౫౫౦ వ సంవత్సర ప్రాంతములయందు మంచిపడుచుతనములో రచియించియుం డును. ఇంతకుఁ బూర్వుఁడైన గారుడపురాణము బాలకవిత్వముగుటచే నశించినదేమో! తిక్కనసోమయాజికి తరువాత నింతప్రౌఢముగా కవిత్వము చెప్పిన తెనుఁగు కవి మఱియొకఁడు లేఁడు. ఈసూరనకావ్యరచనయందు సర్వతోముఖ చాతుర్యము

కలవాఁడు. ఈతని కవిత్వము మృదుపదగుంభితమై ద్రాక్షాపాకముగానుండును. ప్రభావతీప్రద్యుమ్నములోని యీక్రిందిపద్యమువలన నితఁడు గరుడపురాణమును, రాఘవపాండవీయమును, కళాపూర్ణోదయమును, ప్రభావతీప్రద్యుమ్నమును, మఱికొన్ని గ్రంథములును రచియించినట్లు కానఁబడుచున్నది.

మ॥ జనముల్ మెచ్చఁగ మున్రచించితి సదంచద్వైఖరిన్ గారుడం
బును శ్రీరాఘవపాండవీయముఁ గళాపూర్ణోదయంబున్ మరిన్
దెనుఁగుంగబ్బము లెన్నియేనియును మత్పిత్రాది వంశాభివ
ర్ణన లేమిం బరితుష్టి నాకవి యొనర్పంజాల వత్యంతమున్.

ఇందు పేర్కొనఁబడినవానిలో గారుడపురాణముమాత్రము మాకులభించినదికాదు. రాఘవపాండవీయము క్లిష్టార్థములులేకుండమృదుమధురసులభపదములతో రామాయణభారతార్థములు వచ్చునట్లుగా రచియింపఁబడిన శ్లేషకావ్యము. ఇంతటి సులభశైలితో సంపూర్ణశ్లేషకావ్యమును రచియించుట మఱియొకరికి సాధ్యముకాదు. ఈగ్రంథముయొక్క ప్రౌఢిమను కృష్ణరాజు మెచ్చుకొన్నట్లుగా కవియే కళాపూర్ణోదయమునందిట్లు చెప్పియున్నాఁడు.—

మ॥ ఇటుమున్గారుడ సంహితాది కృతు లీవింపొందఁగాఁ జెక్కొన
ర్చుట విస్తారము చెప్ప నేల యవిసంస్తుత్యోభయశ్లేష సం
ఘటనన్ రాఘవపాండవీయ కృతిశక్యంబే రచింపంగ నె
చ్చట నెవ్వారికి నీకె చెల్లెనది భాషాకావ్యముం జేయఁగన్॥

కళాపూర్ణోదయము విచిత్రమయిన కల్పితకథను గలదై తెలుఁగు గ్రంథములలో నిరుపమానముగా నున్నది. సంస్కృతనాటకములలో మాత్ర మిటువంటి కథాచమత్కారము కానఁబడుచున్నదిగాని తెనుఁగులో నెక్కడను నింతవింతయైన కల్పితకథ మఱియొకటి కానరాదు. ఇది నాతికఠినమై మృదుమధురశైలి గలదైయున్నది. ప్రభావతీ ప్రద్యుమ్నము చక్కని స్వభావోక్తులను గలదయి లలితపదఘటితమై కథాచమత్కృతిగలిగి చదువువారికి కర్ణరసాయనముగానుండెడు ప్రౌఢకావ్యము. ఈతఁడు రచియించిన పుస్తకములలో నిదికడపటిదగుటచేతఁ గవి దీనిని ౧౫౭౦ వ సంవత్సర ప్రాంతములయందు రచియించియుండును. ఈకాలముననే యీతఁడు వయసుమీఱినవాఁడగుటచేతఁ దరువాత శీఘ్రకాలములోనే కీర్తిశేషుఁడయియుండవచ్చును. ఈతని కవిత్వశైలి తెలియుటకై పైపుస్తకములనుండి రెండేసిపద్యముల నిందుదాహరించుచున్నాను:—

రాఘవపాండవీయము.

ఉ॥ హారిమృగవ్యసవ్య విహితాదరుఁడా ధరణీశ తేశుఁడ
ధ్వారచితశ్రమాకలితుఁడై కడుమెచ్చె సుతాపగాజలా
సారసమాగమార్హ తమసారససారస సారసారభో
దీరణకారణంబు నతిధీర సమీర కిశోర వారమున్.—ఆ. ౧.

చ॥ అలవియెఱుంగలేక యితరాంగనలంబలె నన్నునిమ్మెయిం
గలఁచుటయుక్తమే యొదవుఁగాక భవత్కృత దుష్టచేష్టితం
బులకుఫలంబు నేఁడొకటి పూర్ణముగానుపభోగ్యమైకడుం
జలమున నెంచు నీమగతనంబు కడంకల రూపుమాలుటల్.—ఆ. ౩.

కళాపూర్ణోదయము.

శా॥ అమ్మా నీపలుకెల్ల నెంతయు నిజంబైయున్న గాన్పించెనే
నిమ్మాయావిప్రకార మిట్లగుట యూహింపంగ లేకొక్కయ
ర్థమ్మున్ వీనికృపం గడింతునని యత్యంతాశ ప్రేరేఁపఁగా
నిమ్మాడ్కిం జెగివచ్చితిం దెరువులేదీపాటు దప్పింపఁగన్.—ఆ. ౪.

చ॥ అననిఁకనేమి చెప్పుదు జనాధిపయాయతి ముఖ్యుఁడంతనె
మ్మనమునఁబట్టలేక ప్రతిమన్ బిగియారఁ గవుంగిలించె నిం
పొనరఁగ లేచివచ్చి కడునొక్క మఱుంగుననప్డు సుగ్రహుం
డునికి యెఱుంగమిన్నగియెనుండఁగ లేకతఁడుంగికాకికన్.—ఆ. ౮.

ప్రభావతీప్రద్యుమ్నము.

ఉ॥ పాడిదొలంగఁజన్నె యొకపట్టునఁ గొల్చెదనంచు నెంతమూ
ర్ఖాడితి సర్వదైవతకులాధిప యోడలఁబడ్డువచ్చు బం
ధ్లోడలవచ్చు నొండొరుల కొక్కొకచో ననువాదుటాలకుం
గూడుట యిష్టబంధులకుఁ గ్రొత్తయె నిత్తఱి నింతయేటికిన్.—ఆ. ౧.

ఉ॥ వట్టిమఱుంగుకట్టి నొడువంబనిలేదది యెల్లభేరిజో
కొట్టుటగాక నిన్ గెలువఁగూడునె మాటలనీవుకంటిన
న్నట్టి శుభాంగుఁడీరమణి యాసలకాస్పద మిప్డొతనిన్
గట్టిగ నన్వయాదికథనంబుగఁ జెప్పియనుగ్రహింపవే.—ఆ. ౩.

పింగళి సూరన్న గిరిజాకల్యాణము లోనిదని యీక్రింది పద్యము రంగరాట్ఛందస్సులో నుదాహరింపఁబడియున్నది గాని యీపుస్తకము నాకు లభించలేదు.—

కం॥ కోపాటోపంబున ధర । ణీపాలకచంద్రముఁడు మునిశిఖామణులన్
ద్రోపించినవాఁడు దురా । లాపములాడుచును బోయి రాసమయమునన్.

---

64 [సశేషము.] కం. వీరేశలింగము.

జయద్రథనాటకము. (౩౭౪ - పుటశేషము.)

[కలహప్రియుఁడు ప్రవేశించును.]

జయ—కలహప్రియా! మంచిసమయమునకే వచ్చితివి.

కల—అయితే నీకు రాత్రినిద్రలేనేలేదా?

జయం—లేదు. మనము మాటాడుచుండఁగానే తెల్లవారినది. నేనుమనయజమానురాలిగారితో మాటాడుటకు సమయము చేయుటకై నీ భార్యనుసీతో చెప్పకయే లోనికిపంపితిని—క్షమింపుము.

కల—నేనును లోనికిబోయి జయద్రథు నవతలకు గొంపోయెద. నీవామెతో నెమ్మదిగ మాటాడవచ్చును.

జయ—నీకు పదివేల నమస్కారములు (కల—నిష్క్రి)

ఇతనికన్న దయావంతుఁడును సద్గుణవంతుఁడునగు మానవుండెచ్చటనైననుండునా!

[దుర్గుణ ప్రవేశించును]

దుర్గు—జయంతా! మీకు, శుభమాగాక! తమకు జరిగిన యన్యాయమునకు నాకు చాల విచారముగానున్నది. ఐన నెప్పుడును చీకటియేయుండదు. దైవమును నీకు తోడ్పడును.

బాబుగారు నమ్మగారును మీవిషయమై మాటాడినారు. అమ్మగారు మీపని మీకొసగుమని నొక్కినొక్కి చెప్పచున్నాను. బాబుగారును మీవల్ల గాయములు తిన్నయతఁడు గొప్పవాఁడనియు,అందువలన నిప్పుడుమీకుపనియియ్యవీలులేదనియు వీలుచిక్కిన తత్క్షణమే యిచ్చుచున్నామనియు ననుచున్నారు.

జయం—అయిన నాకామెతో నొక్కసారి మాటాడవలెనను తలంపు బలముగానున్నది. కొంచెము సమయము చెప్పుము.

దుర్గు—లోపలకు దయచేయుఁడు. నేను సమయముచెప్పెదను.

జయం—మంచిది. సంతోషము.

(ఇరువురు నిష్క్రమించుచున్నారు.)

రంగము—కోటగది.

[జయద్రథుఁడును కలహప్రియుఁడును ఉద్యోగస్థులును]

జయద్ర—కలహప్రియా! ఈ యుత్తరముల నా నావికునకిచ్చి మహారాజునకు నావందనము లర్పింపుమని చెప్పి పంపుము. ఇంతలో నేను మన క్రొత్తకోట పనుల జూచుచుండెద. నీవు త్వరితముగా నరుగుదెంచి నన్నటగలసికొమ్ము.

కల— చిత్తము. సెలవొసగుఁడు. పోయివచ్చెద.

జయద్ర—ఈ చేరువనిర్మింపఁబడుచున్న మందిరమిత్తింతము రండు.

ఉద్యో—చిత్తము.

రంగము ౩. కోట యుద్యానవనము.

(గుణవతి, జయంతుడు, దుర్గుణ మాటాడుచు)

గుణ—జయంతా! సందేహింపకుము. నా శక్తికొలది నీకు సహాయము చేసెదను.

దుర్గు—అమ్మా! ముఖ్యముగా చేయుండి. నా పెనిమిటియు నీవిషయమయి మిగుల విచారించుచున్నారు.

గుణ— నీ పెనిమిటి బహుయోగ్యుడు—

జయంతా! నీకిక విచారింప బనిలేదు. మునుపు నానాథునకు నీకు నెంతస్నేహముగా నుండెనో యంతస్నేహము మరల కలపెదను.

జయం—ఎప్పటికయిన నన్ను నీదాసునిగా నేలుకొనుచుండవలెను. నాకు మీకన్న వేరుదిక్కు లేదు.

గుణ—నీసంగతి నాకిదివరకే తెలియును. నా నాథులు లోకమునకు వెఱచి నీపై నెంతవఱకు కోపమావశ్యకముగా చూపవలసియుండునో యంతమాత్రమె చూపగలరు. నీవిక వెఱవకుము.

జయం—అమ్మా! లోకభీతి కంతముండకపోవుటచే నేను నాపని కెన్నటికిని దూరము కావలసివచ్చునేమో. ఇదిగాక నేను ప్రభువులసన్నిధి నుండనిచో వారునన్నును నేనిదివరకుపడ్డకష్టమును మరతురేమో యను శంకబాధించుచున్నది.

గుణ—ఎంతమాత్రమును సందేహింపకుము. నేను పట్టినకార్యము సాధించువరకును మానను. నా నాథులకెన్నివిధములనయిన విన్నవించికానిచో నాజ్ఞాపించి యైన నీపని నీకిప్పింపగలను. ప్రాణత్యాగమునకయిన నొడంబడుదుగాని చేపట్టిన కార్యమును విడువను. గుండెదిట్టము చేసికొని సంతోషముగానుండుము.

దుర్గు—అమ్మా! బాబుగారు వచ్చుచున్నారు.

జయం—నాకు సెలవొసగుడమ్మా!

గుణ—ఏమి? ఇచ్చటనేయుండి నేను నీవిషయమయి వారితో మాటాడుటవినవా?

జయం—ఇప్పుడు నామనస్సు మిక్కిలి చెడుస్థితిలోనున్నది. నేనిప్పుడు నిలిచి మాటాడలేను.

గుణ—నీయిష్టము. [జయంతుడు నిష్క్రమించును]

[జయద్రథుడును కలహప్రియుడును ప్రవేశించుచున్నారు.]

కల—ఔరా! ఎంతపని!

జయ—ఏమీ? కలహప్రియా! అంటివి.
కల—ఏమియును లేదు—ఏమయిన నంటినేని నాకు జ్ఞాపకమును లేదు.
జయద్ర—ఆవెడలునది జయంతుడు కాడా?
కల—జయంతుడా? కాదు జయంతుడు కాడు. అతడయిన మిమ్ములను జూచిన తోడనే దొంగవలె పారిపోవునా?
జయద్ర—తప్పక యతడే—సందేహము లేదు.
గుణ—ప్రాణేశ్వరా! తొల్లి మీకృపాపాత్రంబయ్యు గ్రహచారవశంబున నేటికి మీ కోపభాజనంబయిన యొక్క సత్పురుషునితో నిప్పుడు మాటాడితిని.
జయద్ర—ఎవరాతడు?
గుణ—ఏమి. మఱజయంతుడు.

క॥ తన మదికందితి నేనియు
మమకారంబుననునాదు మనవిని వేగం
బమరగ జేసెద నేనియు
క్షమియింపగవలె జయంతు సద్గుణవంతున్.

గీ॥ యోగ్యతా యోగ్యతల భేద మొప్పమీర
కనుగొనెడిశక్తి నాయందు గలిగెనేని
యెఱిగి యెఱిగి యేదోషంబు లెపుడు జేయ
జాలడతడంచు జెప్పనే సాహసింతు.

కాన దేవరవారతని తప్పు మన్నించి మరల నాతనిపని యాతనికీయదగు.
జయ—అతడిప్పుడే నావెడలె నిటనుండి.
గుణ—ఔను.

క॥ కటకట తనదుఃఖంబున
నిటనొకపాల్ విడిచినాక నిశ్చలుడగుచున్
టపుట నశ్రువులొలుకగ
..ముచనె క్షమియించి నాథ యతనికి దెమ్మా.

జయ—ప్రాణనాయకీ! అట్లొనర్చుట యిప్పుడు తగదు. కొంతకాలము జరుగవలెను.
గుణ—ఎన్నిదినములు.
జయద్ర—నీవట్లు చెప్పుచుంటివి గాన త్వరితముగానే పిలిచెదను.
గుణ—ఈదినమున రాత్రిభోజనమునకు పిలిపించెదరు.
జయద్ర—ఈరాత్రి కాదు.

గుణ — రేపుమధ్యాహ్నమా?

జయద్ర—రేపు నేనింట భోజనము జేయను. కోటలో సేనానాయకులతో విందునకేగెదను.

గుణ—అట్లైనచో రేపురాత్రి కావచ్చును. లేనియెడల నెల్లుండి మధ్యాహ్నమా యెను. నాయందనుగ్రహించి మూడుదినములు దాటకుండ పిలువవలెను.

సీ॥ మిత్రుడీతండని శత్రుడాతండని యుద్ధంబుల నొకింత బుద్ధినిడక
శిక్షింపవలె తప్పుజేసినతోడనే యెల్లరభేదంబు లిడకమదిని
కానిచో గష్టంబు సేనలమలపంగ నొక్కటయనియెడి యుక్తిదప్పు
నాతనిపనినుండి యవలద్రోయుటకునై కారణంబంతగా కానబడదు

గీ॥ మరచితేమీరు మనపెండ్లి జరుగుకొరకు
మీదుగుణములు వర్ణించి నాదుమదిని
మిమ్ము జేరంగజేసిన మిత్రుడితడు
బిల్వడాతని నాపైని ప్రేమనైన॥

నాథా! ఎప్పుడు బిలిచెద రాతనిని నిశ్చయమెరిగింపుడు. నాకు వింతగా నున్నది! మీరడిగితిరేని దేనినైన నేనింత సేపీయకుండగలనా?

జయద్ర—అతని యిష్టమువచ్చినప్పుడు రావచ్చును. నీవేమియడిగిన లేదనను.

గుణ—నాకిదియొక గొప్పబహుమానము గాదు. తమ యుపయోగము కొరకు శరీరమున కారోగ్యమగు వస్తువుల భుజించుమనిగాని తగిన దుస్తులు ధరించుమని కాని చెప్పెడు రీతినే యిదియు జెప్పితిని. నాపైని మీకుగల ప్రేమ పరీక్షించుటకు.

క॥ ఒసగితి ననుటకె గుండెలు
పసచెడి యడలంగ, జేయ బహుకష్టంబై
యొసగెడు కార్యమె కోరెద
పసలేకున్నట్టి యిట్టిస్వల్పపుపని నా?

జయద్ర—నీమాటకే నెప్పుడు నడ్డుచెప్పను. ఇప్పుడే పోయివచ్చెద.

(నిష్క్రమించుచున్నాడు.)

గుణ—మర్గణా! రా మనమిటుపోవుదము.

(నిష్క్రమించును.)

జయద్ర—ప్రాణనాయకీ! నీమాటకే నిదివరకడుగుదాటియెరుగను. ఇకముందును దాటబోను.

కల—అయ్యా!—

జయద్ర—ఏమనియెదవు?

కల—తమ వివాహవిషయమంతయు జయంతుడెఱుగునా?

జయం—అతనికి మొదటినుండి తుదవరకు దెలియదు. ఏల యిట్లడిగెదవు?

కల—నాకుగలిగిన యనుమానము నివర్తించికొనుటకేకాని యొకందునకుగాదు.

జయద్ర—నీకనుమానమేమి? కలహప్రియా!

కల—ఆతని కామెపరిచయము చాలకాలమునుండి యున్నదని నేననుకొనెదను.

జయ—పరిచయము లేకయేమి. మావివాహమునకు పూర్వము నుండియు మమ్ముల నాతండెరుగును.

కల—ఔను. అందుకు సందేహము లేదు.

జయద్ర—సందేహము లేదూ? నిస్సందేహముగా నీమాటలలో నేమో యర్థమున్నది. జయంతుడు మర్యాదహీనుడా?

కల—మర్యాదస్థుడా!

జయద్ర—మర్యాదస్థుడు! ఔను. మర్యాదస్థుడు.

కల—ఆఁ! నాకు దెలిసినంతవరకు.—

జయద్ర—నీయభిప్రాయమేమి?

కల—అభిప్రాయమా!

జయద్ర—అభిప్రాయమా! ఏదియో చెప్పరానిమాట మనస్సులో దాచుకొని యున్నట్లు నామాటలకు ప్రతిధ్వని నిచ్చుచున్నావు. నీమాటలకేమో యర్థమున్నది. ఇప్పుడే జయంతుడు నాభార్యవద్దనుండి వెళ్ళినప్పుడు "ఎంతపని" యంటివి. ఏమిటది అంతపని? నా వివాహము నాతడెరుగునని నే జెప్పినతోడనే సందేహము లేదంటివి. నీమనస్సులో నేదియో దాచి పెట్టుకొనినట్లు బొమలు ముడివైచితివి. నాబాగు గోరెదవేని నన్ను ప్రేమించెదవేని నీ మనస్సులోని గుట్టు బయలబెట్టుము.

కల—అయ్యా! తమయందు నాకుగల భక్తిశ్రద్ధలు తమరే యెఱుంగుదురు.

జయద్ర—

శా॥ నీమర్యాదయుభక్తిశ్రద్ధయును నేనిక్కంబుగా గాంచి యే
నీమాటల్ కడు యోచనీయములుగా నిత్యంబు నూహించియే
యేమేమో బహు గూఢవాక్యముల నీవిట్లాడగా నాడగా
భీమంబైన భయంబు నామదిని నావిర్భూతమయ్యెన్ వడిన్॥

గీ॥ నీచజనులయందు నెలకొన్నచో నట్టి
పలుకులెప్పుడు నమ్మ నశక్యముగాదు
గాని సజ్జనులగు మానవోత్తములయం
దిరవుకొనిన భయమునీవె చెప్పుమ॥

కల—జయంతుడు బహుయోగ్యుడనియే నాయభిప్రాయము—

జయద్ర—నేను నట్లయోచించెదను.

కల—జనులు మనోవాక్కాయకర్మలయందు భేదించియుండుట బహు వ్యసనకరమయిన పని.

జయద్ర—అధమము కొందరివిషయముననైన నీమాటనిజమే.

కల—సరే. అట్లయిన జయంతుడు బహుయోగ్యుడు.

జయ—ఈమాటలో అర్థము మరియునెక్కువగానున్నది. నాయందనుగ్రహించియైన నీమనస్సులోని మాటలుబయలపుచ్చుము. ఎంత చెప్పరానిమాటయైన చెప్పితీరుము.

కల—మహాప్రభూ! నన్ను తమరీవిషయమున క్షమించవలెను.

సీ॥ క్షమియింపుడీనన్ను విమలాత్మ యీయెడ నీమాటకుత్తరంబీయజాల
మీసేవకుడగాన మీకువశ్యుడనైన మనసునదాచిన మాటచెప్ప
మని యాజ్ఞయీయగా జనునె యీరీతిగా నెవరికి దుర్బుద్ధులెప్పుడుదోచు!
నెవ్వనిమదిలోన నెల్లకాలంబును సద్బుద్ధులుదయించి సఫలతగను!

గీ॥ పసులతో తుల్యులగునట్టి బానిసలును
ధనికులకు జీవనంబులు ధారవోసి
వారి యిష్టానువర్తులై వరలుచున్న
నింగితంబును దెల్పంగ నీయకొనరు.

జయద్ర—నీస్నేహితున కపకారమెద్దియో జరిగినదని నీవెరిగియుండియు మనసున దాచితివేని నీవు నామేలుకోరనివాడవనుటకు సందేహముండదు.

కల—ఉన్నను లేకున్నను ప్రతినరునియందును తప్పులెన్నుటయే నానైజము. నిజమో, కల్లయోగాని నామనస్సున నొక తుచ్ఛాలోచన యుదయించినది. నాయట్టి చపలునూహల నెట్లయిన నెఱింగి మీరు కష్టములపాలగుట నా యిష్టము కాదు. మీసౌఖ్యమునకుగాని మీమేలునకుగాని మీధైర్యస్థైర్యగాంభీర్యాదులకుగాని నా మాట లెఱుంగుటవలన నష్టముండునుగాని లాభముండదు.

జయ—ఈమాటవలన నీయభిప్రాయమేమి?

కల—అయ్యా! స్త్రీపురుషులకెల్లరకు సద్వర్తనమే ముఖ్యభూషణము. ధనాదికంబులెల్ల తుచ్ఛంబులు. నేడు నాయొద్దనున్న ధనమిదివరకెవరివద్ద నుండెనో యిక ముందెక్కడకు బోవునో యెవ్వరెరుగుదురు? కాన జనంబుల కెల్లబానిస వృత్తినున్న ధనంబు దొంగిలించిన దొంగిలించకున్న నొక్కటియే. సద్వర్తనమాత్ర మట్లుకాక. అదిపోయెనేని పోగొట్టినవారిని బాగుచేయకయే పోగొట్టుకొన్నవారి నతికష్టంబులలో ముంచును.

జయద్ర—దైవసాక్షి. ఇప్పుడు నీయాలోచన నెరింగితీరవలెను.

కల—నామనస్సు మీచేతిలో బెట్టినను మీరు కనుగొనలేరు. నామనస్సు నాయొద్ద నున్నంతసేపు నేను చెప్పనే చెప్పను.

జయ—అన్నా! ఎంతమాట యంటివి.

కల—మహాప్రభూ! పరుల సౌఖ్యమునఁగోరు భార్యలనుమాత్రము మరువగూడదు. దుర్మార్గప్రకృత్యంబులాచరించుచు తమ పతులంజూచిఃపునవ్వులనవ్వుచుందురు. వారిదుష్కార్యము లెరింగి యూరకున్న కొంత మేలుగాని యెరుగక మోసపోవుట మిక్కిలి వ్యసనకరమయినపని.

జయద్ర—ఛీ! ఛీ!

కల—తృప్తిగలవానికించుక భాగ్యమున్న నది సౌఖ్యదాయకమగును. తృప్తిలేక పేదనౌదునని భయముగలవాని కెంతభాగ్యమున్న నది యంతదుఃఖకరముగానే యుండును. దైవము మావంశంబు స్త్రీలనెల్ల పతివ్రతలుగా జేయుగాక!

జయద్ర—ఏమి యీమాటలెందుకు? నేనెట్టి యనుమానములతోనయిన కాలము గడపెదనని యెంచుచుంటివా? నాభార్య మిక్కిలి రూపసియనికాని, గానవిద్యయందు నిపుణురాలనికాని, చక్కగా మాటలాడుననికాని చెప్పుటవలన నాకెవ్విధమయిన యనుమానము పుట్టదుగదా? ఇట్టివన్నియు పతివ్రతలకు మరింత సౌందర్యమునిచ్చును. నీవుచెప్పినమాట లెంతమాత్రము బాగుగనున్నవికావు. నాభార్య నన్ను స్వంతముగా కోరుకొని పెండ్లియాడినది. ఛీ! ఛీ! నాకు తగిన కారణము కనబడువరకు అనుమానమయిన పడను. అనుమానపడితినేని యది ఋజువుకావలెను. ఈభారమంతయు నీపైనేయున్నయది

కల—చిత్తము. నాకు చాలసంతోషముగానున్నయది. ఇకను నేను నాయొక్క భక్తిశ్రద్ధలు చూపించవచ్చును. తమరుమాత్ర మేవిధమైన యనుమానములేక జయంతుని మీభార్యను రెండుకన్నులతో గనిపెట్టియుండుడు. మాదేశపు స్త్రీల సంగతి నేనెరుంగుదును. వారి పతివ్రతాధర్మమిట్టికార్యములు పతులెరుంగక

చేయుటగాని జేయకుండుటగాదు.

జయ—నిజమేనా?

కల—మీచూపులను, మాటలనుజూచి వలచి తండ్రిని మోసపుచ్చినది.

జయ—నిజమే అట్లు చేసినది.

కల—ఇక చెప్పవలసిన దేమి? అంతచిన్ననాడె కనుకట్టుకట్టినట్లు తండ్రికన్నులు మూసిపెట్టి—పాపము తండ్రి మీమందువల్ల నట్లానర్చె ననుకొనెనుగదా!—నన్నిట్టిమాటలాడినందుకు క్షమింపుడు.

జయద్ర—నీయెడల నేను బహుకృతజ్ఞుడనైయున్నాను.

కల—నామాటల వలన మీమనస్సుచలించినదని నమ్ముచున్నాను.

జయద్ర—లేదు. లేదు.

కల—చలించినదని నాకు భయముగానున్నది. నేనుజెప్పినమాటలు తమయందు నాకుగల ప్రేమాతిశయమువలన వచ్చినవనిమాత్రము తమరు యోచించవలెను. ఇంతటితో తమరూరక యనుమానపడవచ్చునుగాని యంతకంటె నెక్కువ పనులుమాత్రము చేయకూడదు.

జయద్ర—భయములేదు. అట్లుచేయను.

కల—దేవరవారు. చేయరనియేనమ్ముచున్నాను.—జయంతుడు నాముఖ్యస్నేహితుడు అయ్యో! తమమనస్సు చలించినదిగదా.

జయద్ర—అంతగా చలించలేదు. నాభార్య పతివ్రతయనియే నాయభిప్రాయము–

కల—పతివ్రతయైె యామె చిరంజీవియగుగాక! అట్లుతలచుచుండుటకు భగవంతుడు మీకు దీర్ఘాయువు దయచేయుగాక!

జయద్ర—అయిన ప్రపంచమునఁనెంత మోసమున్నది!

కల—అదేముఖ్యమయినసంగతి. తమయెదుట నోరువిడిచి చెప్పవంటిదేని సృష్టిలో సంబంధముగల సర్వవస్తువులు నొకదానినొకటి యాకర్షించుచుండగా, తన బంధువర్గంబులోన నతిరూపవంతులును విద్వాంసులును గుణవంతులును నగు శాకొమరులగోరక సర్వవిషయంబుల హస్తిమశకాంతరభేదముగలవానిగోరుట—నన్ను క్షమింపుడు. ఆమెవిషయమయి నే నేదియు చెప్పుటలేదు.— కాని యిప్పుడు బుద్ధితెచ్చుకొని మిమ్మునుతమవారితో పోల్చిచూచినదని నాకుమాత్రము భయముగానున్నది.

జయ—సరే, సరే, ఈసంగతి నీవింక బాగుగ కనుగొనుము. నీభార్యనుగూడ కొంచెము కాచియుండుమని చెప్పుము. పిమ్మటమాటాడవచ్చును. [సశేషము]

స్త్రీ హితోపదేశము. (౩౯౦ - పుట శేషము.)

మంత్రసాని విషయము.

గర్భవిషయమైన యీ అధ్యాయమును ముగించి ప్రసవవిషయమయి వ్రాయుట కారంభింపకముందే మంత్రసాని నేర్పరుచుకొను విషయమయి కొంత వ్రాయవలసియున్నది. మంత్రసానిని ఏర్పరుచుకొనుటలో మనవారు ఎంతమాత్రమును జాగ్రత్తపుచ్చుకొనరు. తత్కాలమునకు కనబడిన దానినైనను యొక తెలివితక్కువదానిని కోపిష్ఠయయి పనితెలియని దానిని తీసికొనివచ్చుట యొకగొప్ప దురాచారమయి యున్నది. మంత్రసానియొక్క లక్షణములుగాని, అది చేయవలసిన పనులుగాని, వాని నెరవేర్చుటలో దానికిఉండవలసిన నేర్పునుగాని యెటువంటివో అందునుగురించి పరిశీలించుటకు మనవారు కొంచెమైనను శ్రద్ధవహించుచున్నట్లు కనబడదు. మన దేశములో పనితెలిసిన మంత్రసానులు లేనేలేరు. మంత్రసానులను బాగుగా పరిశీలించి ఈ క్రిందచెప్పబోవు లక్షణములు గలవారలను ప్రసవసమయమునకు కొన్నిమాసములకుముందే యేర్పరుచుకొని యుంచుకొనవలెను. అట్లు చేయుటవలన కొంచెమెక్కువ వ్యయమయినను మంచిదే కాని సొమ్మునకులోభించి తెలివితక్కువ మనుష్యులను తత్కాలమునకు కుదుర్చుకొనుటకూడదు. సంచిలాభము చిల్లిపోగొట్టినన్నట్లు తెలివితక్కువవాండ్రవలన వచ్చునష్టములు ఒకానొకప్పుడు తీరనిదుఃఖములుగానగును. మంత్రసానులను తగినంతసావకాశముగా కుదుర్చుకొని యుంచుకొనకపోయినయెడల మంచిమనుష్యులు తత్కాలమునకు సమకూడకపోవుట సరేకద, ఏకకాలమందే రెండుమూడుచోట్లకు పోవుచుండువారలను తీసికొనిరావలసి వచ్చినయెడల దానివలన చాలచెడుగులు సంభవించును. మంత్రసానిని ముందుగానే కుదుర్చుకొనియుండుట మంచిదని చెప్పుటకు మరియొక కారణము గలదు. ఏమనగా, ఒకవైద్యునికి శరీరతత్త్వము తెలిసియుండుటయు, అందునిమిత్తమయి వైద్యముచేయించుకొను వానిని తరుచుగా చూచుచుండుటయు నెంత ఆవశ్యకమో అట్లే గర్భిణిస్త్రీయొక్క శరీరతత్త్వము బాగుగా తెలిసియుండుటయు అందునిమిత్తమై ఆస్త్రీని ఆకాలములో తరుచుగా చూచుచుండుటయు మంత్రసానికంత ఆవశ్యకము గనుక మంచి మంత్రసానినికొన్ని మాసములకు ప్రసవమగుననగా ఏర్పరుచుకొనవలెను.

మంత్రసాని లక్షణములు—ఇక మంత్రసానికి ఉండవలసిన ముఖ్యలక్షణములనుగురించి కొంచెము వ్రాయుచున్నాను—మంత్రసానిపనిచేయు స్త్రీ మధ్యవయస్సుగలదైయుండవలెను. పిన్నవయస్సుదైనయెడల తెలివి, నేర్పు లేనిదిగానుండును. వృద్ధురాలయినయెడల ఛాందసము, కోపము, మాంద్యము, మూర్ఖత్వమును గలదైయుండును. కావున మధ్యవయస్సుగలదైయుండవలెను. నెమ్మదియు ధైర్యముగలదిగానుండ

వలెను. మంచిదయగల హృదయము, వినయము, చురుకు, నేర్పు, నవ్వుముఖమును గలదిగానుండవలెను. ఇటువంటి సుగుణసంపత్తి సర్వత్రయుండదు. కొందరికి స్వతస్సిద్ధముగాను సులభసాధ్యముగాను ఉండును. కొందరికి పట్టుపడనే పడదు. మొట్టుమీద మంత్రసాని సహజముగా మంచిదిగా నుండవలెను గాని నేర్చుకొనిన మంచిది కానేరదు. మంత్రసానులలో కొంతమంది స్థూలకాయము గలిగియుందురు. వాండ్రు పనికిరారు. అట్టివారలకు నిద్రయెక్కువ మరియు గుర్రుపెట్టి నిద్రింతురు. బాలింతరాలికిని శిశువునకును అత్యంతోపయోగకరముగానుండి వారిని సర్వదా కనిపెట్టియుండవలసిన పనికి గురుపెట్టి నిద్రపోయినయెడల ఆయుపయోగము లేకపోవుటయేగాక గుర్రువారినిద్రకును నెమ్మదికిని భంగముకూడ కలుగజేయును. మనదేశములో స్త్రీలయందు తరుచుగానుండు పరులసంగతులు చెప్పుకొను దోషము మంత్రసానులకు బొత్తుగానుండకూడదు. మంత్రసాని అధికప్రసంగినిగా నున్నయెడల దానివలన బాలింతరాలి మనస్సునకు చాలతొందర కలుగును. అధిక వాచాలత్వము కల మంత్రసాని తెలివితక్కువదిగానుండి తన తెలివితక్కువ చేత వచ్చిన చిక్కులన్నియు వృథాగా చెప్పి మనస్సును కలతపరచును. ప్రతిపనిలోను చురుకులేక తడుములాడు మంత్రసానియును పనికిరాదు. ఇతరమంచిలక్షణము లెన్నియున్నను సమయమునకు కావలసిన వస్తువు చటుక్కున తెచ్చియిచ్చు చురుకతనము లేనియెడల అదియొందుకును కార్యకారి కానేరదు. అటువంటిదానికి బుద్ధిస్థిరముగానే యుండదు. ఒకటి చెప్పిన మరియొకటి అనుకొని యింకొకటి చేయుచుండును. స్పష్టముగా చెప్పినను దానికి బోధపడదు. ప్రతివిషయములోను పోట్లాడుస్వభావముగలది మంత్రసానితనమునకు పనికిరాదు. కొందరు త్రాగుబోతుమనుష్యులు మంత్రసానులమని వచ్చుచుందురు. అట్టివారలను చేర్చకూడదు. మంత్రసానిపనిచేయునది మంచినెమ్మది గలదియును, స్వయముగా బిడ్డలనుకని పెంచినదియును, మంచి శరీరారోగ్యము దార్ఢ్యమును గలదియును, గ్రుడ్డితనము, చెవుడు ఇటువంటిదోషము లేవియు లేనిదియును మృదువుగాను మెల్లగాను మాటాడునదియును, పిల్లలయందు ఆసక్తిగలదియును, శ్రమకు ఓర్చి పనిచేయునదియును, మొద్దునిద్ర, గుర్రు ఇవిలేనిదియునుగా నుండవలెను. ఇంతేకాకుండ బహుపరిశుభ్రత కలదిగా నుండవలెను. బాలింతరాలికిగాని శిశువునకుగాని ఆకాలములో పరిశుభ్రతకంటె కావలసినది మరేమియు లేదు. మంత్రసానిపనికి వచ్చునది అన్నిపనులును స్వయముగా చేయునదిగా నుండవలెను. కాని మరియొకరిచేత చేయించుచు తానుపైగా నుండునదిగా నుండకూడదు. మంత్రసానులుగా వచ్చువాండ్రు వైద్యవిషయములో తమకు అనుభవజ్ఞానము విశేషముగా గలదని చెప్పి బాలింతరాండ్రకు అదియునిదియు నిచ్చుచుందురు. అంతేకాక

తమదుస్సర్వజ్ఞత్వముచేత వైద్యునిమాటకూడ లక్ష్యముచేయక తమకు తోచిన విధమున చేయుచుందురు. అట్టిమంత్రసానులు తమఅశక్తిదుర్జ్ఞనత్వములచేత ప్రాణాపాయము కలుగచేయుదురుగావునఅట్టివాండ్రను చేర్చకూడదు. మంత్రసాని వైద్యునితో చెప్పకుండ లేశమాత్రమైనను ఏ యౌషధమును బాలింతరాలికిగాని శిశువునకుగాని యియ్యకూడదు. మంచితెలిసినవైద్యుని ఏర్పరుచుకొని ప్రతివిషయములోను అతనియాలోచన ప్రకారము నడుచుచుండవలెను గానిస్వబుద్ధిచేత నేమియు చేయకూడదు. మంత్రసాని ఇకవారము పదిదినములలో ప్రసవ సమయముతటస్థించుననగా వచ్చి సర్వదా యింటిలోనేయుండవలెను. తత్కాలమునకు దానికొరకుపరుగెత్తుట అసంభావితమును అనుపయోగమును అయినపని. వారముదినములకు ప్రసవమగుననగా ప్రతిదినమును ప్రసవగృహము మంచము కావలసిన యితర సంభారములు అన్నియు జాగ్రత్తపరచి చూచుచుండవలెను.

ప్రసవమయిన తరువాత నడికట్టుకట్టునట్టిక్రమము మంత్రసానులకు బాగుగా తెలిసియుండవలెను. అందుకు కొంత తెలివియును కొంత అనుభవమునుకూడనుండవలెను. ఈకట్టువలన ప్రసవించిన స్త్రీలకు బలము సుఖము లాభముకూడ కలుగును. కట్టుక్రమము మంత్రసానులకు తెలియనియెడల వైద్యునివలన నేర్చుకొనవలసియుండును. ఈవిధమయిన కట్టుయుక్తముగా ప్రసవించిన వెంటనే సరేకదా ప్రతిదినమును సాయంకాలమునను ఉదయమునను మూడువారములవరకైననుకట్టుచుండిన యెడల కడుపులుక్రిందికి వ్రేలాడుచుండుట మొదలగు అవలక్షణములేమియు సంభవించవు.

మంత్రసాని చేయవలసిన పనులలో మరికొన్నిటి నిక్కడ వివరించవలసియున్నది. అవేవనగా, ౧ ప్రసవగృహమును బహుశుభ్రముగాను, మనోహరముగాను, సువాయుప్రసారము కలదిగాను ఉంచుట. ౨ వస్త్రములు గుడ్డలు మాసిన వెనుక మూలలను మంచముక్రిందను అక్కడను ఇక్కడను ఉంచక ఉతుకుటకవతల పడవేయుచుండుట. ౩ అనావశ్యకమయిన పాత్రాది గృహోపకరణములేవియును ఆయింటిలోనుంచకుండుట. ౪ శీతకాలమయినయెడల కుంపటిలోనిప్పులు సర్వదా ఉంచి గృహము వెచ్చగానుండునట్లు చేయుచుండుట. ౫ చిన్నపిల్లలు ఆలోపలికివచ్చి అల్లరిచేయకుండ జాగ్రత్తవహించుట. ౬ తల్లి సుఖముగా నిద్రించునట్లు శిశువును తాను సర్వదా కనిపెట్టిచూచుకొనుచుండుట. ఈపనులుగాక మంత్రసానిముఖ్యముగా చేయవలసినపని మరియొకటిగలదు. అదేమనగా ప్రసవించుటతో సంబంధము గలిగిన యావద్భాగమును ప్రతిదినమును ఉదయాస్తమయములను గోరువెచ్చనినీళ్ళతో శుభ్రముగాకడుగుచుండవలెను. వైద్యుని కావశ్యకమనితోచి చెప్పిన

యెడల అందుకుతగిన పిచికారీతో నీళ్ళుకొట్టి శుభ్రపరచుచుండవలెను. ఇట్లు చేయుటవలన శైత్యముచేయును అను తెలివితక్కువమాటలాడు మంత్రసానుల వాక్యముల నెంతమాత్రమును విశ్వసించకూడదు. అటువంటి మంత్రసానులను మరొకసారి పిలువనేకూడదు. ఈప్రక్షాళనము విశేషకాలము అక్కరలేదు. రెండుమూడువారములుమాత్రము ప్రతిదినమును రెండుసార్లు ఆట్టేసేపు ఉంచక బహు శీఘ్రముగా జరిగించి వెంటనే పొడివస్త్రములతో తుడిచివేయుచుండుట అత్యావశ్యకమయినపని.

మంత్రసాని స్వతంత్రించి వైద్యుని యాలోచన లేనిది యేమియును తల్లికిగాని శిశువునకుగాని యిచ్చుటగాని చేయుటగాని యెంతమాత్రమునుకూడదు. పైని చెప్పినరీతిదిగాని, లేక మరియొకరీతి అయినది (Enema apparatus) గాని పిచికారీని గాని సిద్ధముగా తనయొద్దనుంచుకొనవలెను తల్లియొక్క మనస్సునకు ఇబ్బందికలుగు ప్రస్తావనలు చెప్పుటగాని ఆమెయొక్క నిద్రకు భంగము కలుగచేయునట్లు ధ్వనిచేయుటకాని కూడదు. ప్రసవించుచు ఆవేదనపడుచున్నప్పుడు తనకు తెలియకున్న వైద్యుని అడిగి తెలిసికొననిది 'ఇకయెంతో ఆలస్యము లేదు' వృథా హెచ్చరికలు చేయకూడదు. ఆసమయమందు నిజము చెప్పుట క్షేమము. ఇన్నిలక్షణములు, జాగ్రత్త, తెలివిగలవారలనే మంత్రసానులనుగా కుదుర్చుకొనవలెను. ఇటువంటి సంపూర్ణలక్షణములుగలవాండ్రు దొరుకుదురా అని అడుగుదురేమో. అందుకొరకు ప్రయత్నము చేసినయెడల దొరకవచ్చును. అట్టివాండ్రఅవసరము అందరికిని కలుగునదే గనుక కొందరికి ఆపని బాగుగా నేర్పించినయెడల చాల ఉపయోగముగానుండగలదు. వారిపనిలోనేమాత్రము స్వల్పలోపములున్నను తల్లికిని శిశువునకునుకూడ ప్రాణాపాయము తెచ్చునది అగుటచేత మంత్రసాని విషయమయి యెంత ప్రయత్నముచేసి యెంతశ్రమపడి అయినను అనుకూలమయిన దానిని సంపాదించుట పరమావశ్యకమని అందరికిని స్పష్టముగా తెలియదగిన సంగతియే.

ప్రసవసమయము తటస్థించినప్పుడు అన్నివస్తువులు సిద్ధముగా నుంచుకొనవలెను. వస్త్రములు, కంబళ్ళు, మొదలయినవన్నియును బాగుగా నెండించి జాగ్రతపరచి యుంచుకొనవలెను. తగినమంత్రసానిని పిలిపించి యింట నుంచవలెను. ఆవశ్యకమైనయెడల రావలసియుండునని వైద్యునికి వర్తమానముపంపియుండవలెను. గదిబాగుచేసి పరిశుభ్రముగా నుంచవలెను. ప్రసవించబోవు స్త్రీ మిక్కిలి ధైర్యముగాను సంతోషముగానుండవలెను. తాను తొమ్మిదిమాసములనుండి పడుచున్న శ్రమకు నేడు విముక్తి కలుగుననియు ఆకలుగుటలో తానొకశిశువునకు తల్లినగుదుననియు తనజన్మమునకు సంతోషకరమయిన ఆశిశువుయొక్క రోదనము తానువినుదుననియు సంసిద్ధురాలై

యుండవలెను.

చతుర్థాధ్యాయము.

ప్రథమ ప్రసవము — అనగా మొదటికాన్పు.

తరువాత వచ్చుకాన్పులకంటె మొదటికాన్పు తరుచుగా చాలసేపు ఉండునదియును అత్యంతము ఆయాసకరమయినదియును అయియున్నది. కావున ప్రసవవేదన విషయమయి యీ దిగువ నుదాహరింపబడిన యంశములను జ్ఞాపకముంచుకొని అటుల జరిగించుటవలన గలుగులాభములను పొందుటకు స్త్రీలకందరికిని ప్రత్యేకించి తెలియజేయుచున్నాను.

ఇకనొకటిరెండుదినములలో నొప్పులారంభమగుననగా గర్భములోని శిశువు క్రిందిభాగమునకు వచ్చియుండును. అందుచేత గర్భిణీస్త్రీలకు అదివరకున్న భారము చాలమట్టుకుతగ్గి మిక్కిలి సులువుగాను సంతోషముగాను తిరుగుటకు మరింతచులకనగాను ఉండును. ఊపిరి సులభముగా విడుచుటకేమి, కావలసిన వస్తువులను స్వయముగా జాగ్రత్తచేసికొనుటకేమి విశేషోల్లాసము కలిగియుండును. తెలివిగల స్త్రీలకు ఇట్టిస్థితినిబట్టి ఇకకొంచెముసేపటికే ప్రసవారంభమగుననికూడ తోచును. ఇట్లు తరుచుగా నందరికిని కలుగునదే; గాని యెక్కడనో ఒకానొకస్త్రీకి మాత్రము కలుగదు.

ఇకను ప్రసవించుననగా ఈరీతిగా సులువు కలుగచేయుగర్భచలనము అనగా శిశువు క్రిందభాగమునకు వచ్చియుండుట, కొందరికి కొన్నిదినములకును, కొందరికి అవ్యవధిగా కొన్నిగంటలకును ముందుగా కలుగును. కాబట్టి ప్రసవచిహ్నలలో ఈగర్భగళితమే ప్రధానప్రథమచిహ్నగా నెంచుకొనవలెను. దీనివలన భారముతగ్గి సులువుగానుండుటచేత సుఖముగానున్నను గర్భము మూత్రకోశముపైని మోపియుండును గనుక లఘుశంకకు తరుచుగా బోవలసియుండు బాధయొకటి తటస్థించును. కాబట్టి ఇందునుబట్టికూడ ప్రసవవేదన సమీపించుచున్నదని గ్రహింపవచ్చును.

ఈసమయమందే గర్భద్వారమందును పైభాగమందును కూడ విశేషముగ ద్రవము కలుగును. తరువాత కొంచెము నొప్పిపెట్టి తీగెబయలువెడలును. — ఈతీగె యనునది గర్భిణికాలమందు గర్భద్వారమును గట్టిగామూసియుంచిన యొకజిగురుసీలయని చెప్పదగినదైయున్నది. ఈతీగెతో రక్తజీరకూడ కనబడును. తీగెవచ్చుటకు ప్రారంభించగానే ప్రసవమునకు ఉన్ముఖమయినదని నిశ్చయించవచ్చును. ప్రసవచిహ్నములలో ప్రథమములో కనబడువానిలో, తరుచు లఘుశంకకుపోవతె

సని యుండుట యొకటిగానెంచవలెను.

క్రమముగా, కోతనొప్పులని చెప్పదగినవి ఆరంభమగును. ఇవి ఒకసారి రెండుగంటలు తాళియు మరియొకప్పుడు గంట గంటకును లేక అరగంట వ్యవధానముగాను వచ్చును. ఈనొప్పులు ఆరంభమయినతరువాత కొంచెము చలియును వణకును వచ్చును. అది క్రమముగా ప్రసవమగుచుండుటకు సూచనయేగాని యొకజబ్బుగాదు. చలియును వణకును ఎంతవిశేషముగా నున్నను శరీరముమాత్రము వేడిగాను చెమటపోయుచును ఉండునుగాని చల్లపడదు. చలియును వణకును ఉన్నదని చెప్పి లోపలికి ఏమియు పుచ్చుకొనగూడదు. కావలసినయెడల ఒకటిరెండు దుప్పట్లుకప్పుకొనవచ్చును. మరలవిశేషముగావేడికలుగచేసినయెడల నీరసమును ప్రసవమునకు ఆలస్యమును చేయునుగనుక పైగాకప్పినదుప్పట్లు క్రమముగా తీసివేయవలెను. ప్రసవసమయములో కొందరికి వమనము వెళ్ళిపోవునట్లుండును. మరికొందరికి వాంతిఅగుటయునుగలదు. ఆలాగుననున్న యెడల అదిమంచిదే కాని జబ్బుగాదు. సుఖప్రసవమునకు సూచనఅనికూడ కొందరందురు. దీనికిని ఏమియు చికిత్స చేయనక్కరలేదు. ఆసమయములో నేదైనను లోపలికిచ్చినయెడల మరికొంత నష్టమేకాని లాభమేమియు లేదు.

పైనిచెప్పిన యీకోతనొప్పులనునవి క్రమముగా విశేషించి సమానవ్యవధిగాను వెంటవెంట నేయుచు వచ్చుచుండును. ఈ అవస్థలో కొందరు తెలివితక్కువ మంత్రసానులును స్త్రీలును తమకే మేము తెలియుననియు అనుభవజ్ఞులమనియు గర్వములో గర్భమును క్రిందకిఅదిమినయెడల బాధతగ్గునని తెలివితక్కువయాలోచన చెప్పుచుందురు. ఆప్రకారము అదిమినయెడల ప్రసవము మరింతఆలస్యమగుటకును బాధయెక్కువగుటకును కారణమగును గాని లాభమేమియును లేదు. ఇంకనుఆలాగున చేయుటకంటె ఆసమయములో పరుండియుండక మంచముమీదినుండి లేచి కొంచెము నడిచినను కూరుచుండియున్నను చాలమంచిది. ఈయవస్థలో నేకాదు. మెట్టుమీద సహజమైన రీతిని ప్రసవించుచుండగా నెప్పుడును, సులభముగా ప్రసవింపచేయుదుమని చెప్పి మంత్రసానులుగాని యితరులుగాని ప్రసవించు స్త్రీలను ఏమియు చేయగూడదు. వారికి ఏవిధమయిన తొందరయును ఇయ్యకూడదు. ఆలాగున చేయవలెను, ఈలాగున చేయవలెను, అనివారికి నావశ్యకమయిన ఆలోచనలేమియు చెప్పకూడదు. మంత్రసానియు ముఖ్యమయిన మరియొకరిద్దరును సమీపములో మాత్రము ఉండవలెను. ఎందుకైనను అవసరమని తోచినయెడల వర్తమానము పంపబడునని వైద్యునికి తెలియచేసియుండవచ్చును. భర్తగాని బిల్లరజనముగాని ఉండకూడదు.

కోతనొప్పులు కలిగినతరువాత కొంతసేపటికి త్రోపుడు నొప్పులని చెప్పదగి

నవి ఆరంభమగును. ఇవి ఆరంభమయిన తరువాత శరీరము మరింతవేడిగాను చెమటపట్టుచును ఉండును. ఈనొప్పులే నిజమయిన ప్రసవవేదన అని చెప్పతగినవి. ఇవి వెన్నులోను తొడలలోను కలుగును. ఇవిఒకసారివచ్చి క్రమముగా హెచ్చి యేలాగున హెచ్చినవో ఆలాగుననేతగ్గి కొంతసేపటికి మరలవచ్చుచు, అటుతరువాత అంతకంటె వేగముగావచ్చును. ఈరీతిగా ఒకక్రమమును అనుసరించివచ్చుచుండును. ఈఅవస్థలో కలుగుబాధకు స్త్రీమూల్గుచుండునుగాని కోతనొప్పులువచ్చుచున్న అవస్థలోవలె కేకలువేయదు.

ప్రసవించుటకు సహాయముచేయుమనిచెప్పి యేమియును చేయకూడదను విషయమయి యిచ్చట కొంచెము వ్రాయవలసియున్నది. ప్రసవించుట అనునది స్త్రీలకు స్వభావసిద్ధముగా అగుకార్యము గాని మనుష్య సహాయముచేత కాదగినదికాదు. గనుక అందుకు సహాయము చేయుదుమని చెప్పమాట వెఱ్ఱిమాటగానున్నది. అంతేకాకుండ సహాయము చేయుదుమని చేయు పనులవల్ల ప్రసవము సులభముగా నగుటకుబదులుగా మరింత కష్టముగాను ఆలస్యముగాను అగును. కాబట్టిసహాయమనునదిఅనావశ్యకమగుటసరేకదహానికరముకూడనగును. ఆసమయములోనున్నబాధనుబట్టివైద్యుడుగానిమరెవరైననుగానియేలాగైనను బాధనుతగ్గించగలసాధనము చేయగలరేమో అని ప్రసవస్త్రీలును,ఏమయినను చేసి బాధతగ్గించెదమని అల్పజ్ఞులైనమంత్రసానులునువైద్యులుమొదలగువారును ఊహించుచుందురుగాని అదిగొప్పపొరబాటు ఊహగనుక సహజరీతిని అగుప్రసవములలో తేనిపోనిపనులు చేయకూడదను సంగతి అందరును బాగుగజ్ఞాపకముంచుకొనవలెను. ప్రసవమునకు ఏమయినను వ్యతిరేక లక్షణములు అనగా మొట్టమొదటనే నీరువచ్చుట నొప్పిలేకపోవుట ఇట్టివి తటస్థమయిన యెడల వైద్యుడు ముఖ్యముగాఉండి శిశువు ఏలాగున బయలుపడునో కనిపెట్టి పనిచేయవలసిన యావశ్యకముండునుగాని సహజముగా ప్రసవమగుచున్నయెడల నెవరును ఏమియుచేయనక్కరలేదు. ఈవిషయమై యింకొకసంగతి జ్ఞాపకము ఉంచుకొనినయెడల నేనుచెప్పినది నిజమేయని తోచవచ్చును. ఏమనగా గర్భోత్పత్తి అయినది మొదలుకొని శిశువు తల్లిగర్భములో వృద్ధిపొందుటకు తగినయుపాయముచేసిన మహాశక్తిగల భగవంతుడు శిశువుబయలువెడలునట్లుచేయుటకు సమర్థుడుకాడా? భగవంతునికి అల్పజ్ఞులైన మనుష్యులయొక్క సహాయముకావలెనా? శరీరములో జీర్ణకోశముశ్వాసకోశము మొదలైన కోశములయొక్క స్వభావసిద్ధమయినపనులకు మనుష్యులయొక్క సహాయమేమయినను కావలసివచ్చుచున్నదా? పశుపక్ష్యాది జంతువుల ప్రసవమునకేసహాయమైనను కావలసివచ్చుచున్నదా? వీనికి మనుష్యసహాయము కావలెనని తలచుట యెంత

తెలివితక్కువో భగవంతునిమహిమా విశేషమును కనపర్చెదు సహజసుఖ ప్రసవ కార్యమునకు సహాయముకావలెనని తలచుటయును దానికంటె ఎక్కువ తెలివితక్కువగా భావించవలెను. శిశువు గర్భమునుండి వెలుపలకు వచ్చుటకు మొట్టమొదట ఆయాకోశములయొక్క ద్వారములు పెద్దవి అగుటయు, అందుకొరకు చుట్టుప్రక్కలనున్న మలమూత్రకోశములు జఠరము వీనిలోని పదార్థములను వెలుపరించి వానిని పట్టినిగాజేసి మరింతచోటు కలుగచేయుటయు, ద్వారము పెద్దదైన తరువాత శిశువు క్రమక్రమముగా క్రిందికివచ్చునట్లు చేయుటయు, మధ్యమధ్య విశ్రాంతి కలుగచేయుటయు ఇవన్నియు సర్వశక్తిగల భగవంతుడు ఏర్పాటుచేసిన పద్ధతులయియుండగా అవిక్రమముగా జరుగనియ్యక తమస్వల్పబుద్ధితో అందుకు అభ్యంతరము కలుగులాగున నేమిచేసినను అది మిక్కిలి తెలివితక్కువపనియనియును అపాయకరమనియును చెప్పుటకు ఎంతమాత్రమును సందేహములేదు. విశేష కార్యముకొరకు భగవన్నియమితమయిన నొప్పులను తగ్గించుటకు వైద్యుడుగాని, మంత్రసానిగాని, స్త్రీస్వయముగాగాని చేయునే ప్రయత్నముకు కార్యకారికానేరము సరేకద వానిని మరింతహెచ్చుచేయునను నంశము బాగుగా జ్ఞాపకముంచుకొనవలసినదని ఒకటి, రెండు, మూడుసార్లు చెప్పదగిన విషయము. మరియు అట్టి ప్రయత్నములు పిమ్మట చాలజబ్బులకు కారణమగును గనుక ఇందునుగూర్చి యింతదూరము వ్రాయవలసివచ్చినది.

ప్రసవించుటకు సహాయము చేయకూడదనియును, ఆవశ్యకములేదనియును వ్రాసినపైయంశమంతయు సహజముగాను యథాక్రమముగాను అగుచున్న ప్రసవములవిషయము. కొన్నిసమయములలో దైవవశముచేత ప్రసవముక్రమమునను సరించియుండదు. అట్టివైపరీత్యములు తటస్థించినప్పుడు వైద్యసహాయము అవశ్యముగ కావలసియుండును. అట్టిసహాయము అతిశీఘ్రముగ పొందవలసియుండును. ఆసమయములో ఒక్కొకక్షణము ఒక్కొక లక్షవరహాల విలువగలదని చెప్పవచ్చును. వైద్యుడు మిక్కిలి నెమ్మదిగలవాడును ధైర్యస్థైర్యములుగలవాడును సూక్ష్మగ్రహణ సామర్థ్యముగలవాడును అనుభవముగలవాడును నేర్పుగలవాడును పనిలోచురుకుగలవాడును అయియుండవలెను. క్రమానుసార ప్రసవములలో వైద్యునిపనియెంత లేదో క్రమముతప్పి వచ్చినపుడు అతనిపని అంతయుండును. ఇట్టియసాధారణ విషయములలో ఎట్టిస్థితిలోనేమేమి యేలాగున చేయవలసినదియు మంత్రసాని శాస్త్రములో సవిస్తరముగా వివరించబడియుండును. గనుక, అందునుగూర్చి యిచ్చట వ్రాయనక్కరలేదు.

[సశేషము.]

సూర్యశతకము. (౩౪౭-పుట శేషము.)

స్ర॥ మత్వాన్యాన్పార్శ్వతో౽శ్వాన్ స్ఫటికమణిదృష ద్దృష్టదేహాద్రవంతీ,
వ్యస్తైహాన్యస్తసంధ్యే యమితిమృదుపదా పద్మరాగోపలేషు।
సాదృశ్యాదృశ్యమూర్తి ర్మరకతకటకే క్లిష్టసూతానుమేయో।
ర్యోగ్యర్థాన్యావృత్తిలబ్ధ ద్రుతగతిరవతా ద్బిభ్రద్వాహావళిర్వః॥ ౪౬॥

మ॥ ప్రతిబింబమ్ములు గన్పడం, బలుగురాపట్ల న్బరాశ్వమ్ములన్।
మతితోఁ ద్రొక్కలఁబాఱుచు, న్గదిపగ ల్మాణిక్యముల్గాంచి సం।
జతలంపొంది నడజ్జడస్పదుముఁ, బచ్చల్గల్గుచోఁ గానరా।
కలిఖిన్నండుగ యంత, పర్వలిడు సూర్యాశ్వమ్ములో మున్నిమున్॥ ౪౬॥

స్ర॥ హేలాలోలం వహంతీ విషధరదమన స్యాగ్రజే నావకృష్టా।
స్వర్వాహిన్యాస్సుదూరం జనితజవజయా స్యందనస్య స్యదేన।
నిర్వ్యాజంతాయమానే హరితిమనిజ స్ఫీతఫేనాహితశ్రీ।
రశ్రేయాంస్యర్వపఙ్క్తి శ్శమయతుయమునే వాపరాతాపనీవః॥ ౪౭॥

మ॥ ద్యునదిన్మీఱుచు స్యందనప్రవడి, హేలోద్రిక్తత న్బాఱి, నా।
గనుదగ్రోద్ధ్వజు డట్టిలాగ, నెఱయంగా నచ్చుపుంబచ్చడా,।
ల్ఘనమౌ నుర్వుల నందమొంది, పరయౌ గాళింది నానొప్పుతా।
పనవాహావళి, మీయమంగళముల న్భంగంబు నొందించుతన్॥ ౪౭॥

స్ర॥ మార్గోపాంతే సుమేరో ర్నువతికృతనతే నాకధామ్నాం నికాయే।
వీక్ష్యక్రీడావతీనాం ప్రతికుహరముఖం కింనరీణాం ముఖాని।
సూతే సూయత్యపీష జ్జడగతివహతాం కంధరాగ్రై ర్వలద్భి।
ర్వాహానాం వ్యస్యతాద్వ స్సమమసమహరే ర్హ్రేషితం కల్మషాణి॥ ౪౮॥

మ॥ సురబృంద మ్మమరాద్రిదారి దరులన్జోతల్నుతుల్సేయఁ, గం।
దరవక్త్రింబుల హ్రీమదశ్వ ముఖకాంతావక్త్రముల్గాంచి, వే।
సరిన న్సారథి, ద్రిప్పుచు న్నెడల నీషన్మందతం బాఱువా।
సరకృద్వాజులు మీయఘమ్ములు సముత్సారించు నువ్వెత్తుగన్॥ ౪౮॥

---

౪౬. పలుగురాపట్లు=స్ఫటికభూములు. మాణిక్య=కెంపులు. యంత=సారథి.

౪౭. స్యందన=రథము, ప్రవహించుట. నాగ......ద్ధ్వజుడు. (కాళియమర్దనునికి) కృష్ణునికి, గరుడునికి అన్న=(బలరాముఁడు, అనూరుఁడు.) పర=రెండవ. కాళింది=యమున. తాపన=సూర్యునిది, సూర్యునికూతురు.

౪౮. జోతలు=మ్రొక్కులు. హ్రీ......వక్త్రములు=సిగ్గుపడు కిన్నరస్త్రీల మొగములను.

స్ర॥ ఘ్నన్వంతో నీరదాళీ ర్నిజరుచిహరితాః పార్శ్వయోః పక్షతుల్యాః।
స్థాలూత్తానైఃఖలీనైః ఖచితముఖరుచ శ్శ్చ్యుతతాలోహితేన।
ఉడ్డీయేవ వ్రజంతో వియతి జవవశా దర్కవాహాః క్రియాసుః।
క్షేమం హేమాద్రిహృద్య ద్రుమశిఖరశిర శ్శ్రేణిశాఖాంశుకావః॥ ౪౯॥

చ॥ స్వరుచిహరిద్ఘనాళు లిరుప్రక్కల ఱెక్కలువోలె నాడ, ను।
త్త్వరఁజనుచు న్దివి న్నెగసి, దౌడలవెల్కలఁ గళ్ళెముల్పడన్।
తురదసృగాస్యకాంతుల శుకంబులు నాఁగ నగాద్రిశృంగ సుం।
దరతరులం జెలంగు నినుతట్టువ ముబ్బన దిష్టదంబులౌ॥ ౪౯॥

ఇత్యశ్వవర్ణనమ్.

అనూరువర్ణనమ్.

స్ర॥ ప్రాతశ్శైలాగ్రరంగే రజనియవనికా పాయసంలక్ష్యలక్ష్మీ।
ర్వ్యక్షిప్యాపూర్వపుష్పాంజలిముడునికరం సూత్రధారాయమాణః।
యామేష్వంకేష్వివాహ్నః కృతరుచిషువత ష్వేవలబ్ధప్రతిష్ఠా।
మవ్యాత్ప్రస్తావయన్వో జగదవనమహా నాటికాం సూర్యసూతః॥ ౫౦॥

చ॥ ఉదయధరాగ్రరంగమున నాయ్యనరే తెరయెత్తఁగానసై,।
ముదమునఁ జుక్కలన్విరుల పూర్వతనంజలిఁ జల్లి సూత్రధా।
రదశబగంటినాల్గు ప్రహరంబుల నంకములన్వలె న్రుచి।
ప్రద, జనమోదనాటిక, దొరంకొను గాశ్యపి మిమ్ముఁగాచెడున్॥ ౫౦॥

స్ర॥ ఆక్రాంత్యా వాహ్యమానం పశుమివహరిణా వాహకోగ్ర్యోహరీణాం।
భ్రామ్యంతం పక్షపాతా జ్జగతి సమరుచి స్సర్వకర్మైకసాక్షీ।
శత్రుంనేత్రశ్రుతీనా మపజయతివయో జ్యేష్ఠభావే సమేపి।
స్థేమ్నాం ధామ్నాంనిధిర్య స్సభవదఘనుదే నూతనస్త్వాదనూరుః॥ ౫౧।

చ॥ హరులకు నాయకాగ్ర్యుఁడు, సమాభిరుచివ్రతి, సర్వసాక్షి, యే।
యరుణుఁడు, దుల్యమైనను వయోధికభావము, గోవుఁబోలెఁ దై।

---

౪౯. స్వ......నాళులు= గుఱ్ఱముల పచ్చరంగు సంక్రమించిన మేఘపఙ్క్తులు గళ్ళెములు వెల్కలఁబడగా. తుర......తుల=స్రవించు నెత్తురుగల మొగము యారుణ్యముచే. తరులన్=చెట్లయందు.

౫౦. ధర=పర్వతముయొక్క. అపూర్వతన్=క్రొత్తఁదనముతో. ప్రహర=జాము రుచి=వెలుఁగు, ఆనందము. దొరంకొను=ఆరంభించు. కాశ్యపి=అనూరుఁడు

హరినడిపింపఁ, బక్షుల నార్చుచు, దృక్శ్రుతిబద్ధమత్సరున్।
గరుడుని నోర్చు, ధామనిధి నవ్యుఁడుమీ యఘమార్తఁ దేర్చెడున్॥ ౫౧॥

స్ర॥ దత్తార్ఘ్యైర్దూరనమ్రైస్త్రియతి వినయతో వీక్షితస్సిద్ధసార్థ్యై।
స్సానాథ్యంసారథిర్వ స్సదశశ తరుచే స్సాతిరేకం కరోతు।
ఆపీయప్రాతరేవ ప్రతతహిమపయ స్స్యందినీ రింక భానూ।
ర్యః కాష్ఠాదీపనోఽగ్రే జడిత ఇవభృశం సేపతే పృష్ఠతోఽర్కః॥ ౫౨॥

మ॥ వినతుల్దవ్వున, నర్పితార్ఘ్యులు, దివిస్వీక్షింప సిద్ధౌఘముల్।
ఘననీహార కణస్రవిందుకరసంఘంబాని, శీతార్తుఁడో।
యనఁ, బృష్ఠంబున నర్కుఁగొల్చు, మును గాష్ఠాదీపనుండేతఁడా।
యినసూతుండెసఁగించుగావుత భవత్సేనత్వము న్వేకువన్॥ ౫౨॥

స్ర॥ ముంచన్శీర్షస్థినాదౌ, దినగమసమయే సంహరంశ్చస్వతంత్ర,।
స్తోత్రప్రఖ్యాతవీర్యో, వియతిహరిపదాక్రాంతిబద్ధాభియోగః।
కాలోత్కర్షాల్లఘుత్వం ప్రసభమధిపతౌ యోజయన్సూర్య ద్విజానాం।
సేవాప్రీతేనపూష్ణా స్వసమ ఇవకృత స్త్రాయతాం సోఽరుణో వః॥ ౫౩॥

మ॥ కడునాస్థ న్గగనంబునన్ హరిపదాక్రాంతి న్గనున్, రశ్ములన్।
విడుచ న్వేకువ, సంజసంహృతి, స్వతంత్రించున్, వడిన్లాఘవం।

---

౫౧. హరులకు= గుఱ్ఱములకు. సమా......ప్రతి= లక్ష్మినిచ్చు ప్రకాశము, సమత్వాభిలాషము, తప్పనివాఁడు. వయః= ఈడు, పక్షి. అధికభావము= పెద్దతనము, దొరతనము. గోవు=ఎద్దు. పక్షులనార్చు=తనవారిని బాగుచేయు, తెక్కలాడించు, దృక్శ్రుత్సరున్=(వినుచూడ్కులు) పాములయందుఁ దిరమగు పగగలవాఁడు, కన్నులకుఁ జెవులకు నెప్పడుద్వేషి. ఓర్చు=ఓడించు. ఏర్చు=కాల్చు.

౫౨ వినతులు=మ్రొక్కినవారు. ఘన.....సంఘంబు=పెనుమంచు చినుకులు రాలుచు చంద్రకిరణములగుమిని. మును=ముందు. కాష్ఠ+ఆదీపనుఁడు=కట్టెలఁ బాగుగ మండించువాఁడు, (కాష్ఠా) దిక్కును జక్కగ మెఱయించువాఁడు. భవత్సేవత్వమున్=మీదిక్కుకలిమిని.

౫౩. హరిపదాక్రాంతిన్= అనూరుఁడు, గుఱ్ఱముల కాలినడకను, సూర్యుఁడు స్థిరరాశి సంక్రమణప్రాప్తిని, లేక, సింహరాశి (స్వస్థాన) ప్రాప్తిని. రశ్ములు=త్రాళ్ళు, కిరణములు. సంజన్=సాయంకాలమున. సంహృతిన్=త్రాళ్ళు బిగలాగుట, (కిరణములు) మరలించుటయందును. లాఘవంబు=చిన్నతనము, క్షీణ

విడువేలా ఘనతన్ ద్విజేశునకు, వీర్యాఢ్యస్వతస్తోత్రుఁడే।
విడుఁబోల్చెం దనుమెచ్చి ప్రోద్దనగ్రహాధీడ్యంత మిమ్మెప్పుడున్॥ ౫౩॥

స్ర॥ శాతశ్శ్యామాలతాయాః పరశు రివ తమో రణ్యవహ్నే రివార్చిః।
ప్రాచ్యేవాగ్రే గ్రహీతుం గ్రహకుముదవనం ప్రాగుదస్తాగ్రహస్తః।
ఐక్యం భిందన్ద్వయోర్భూమ్యో రవధి రివ విధాతేవ విశ్వప్రబోధం।
వాహానాం వో వినేతా వ్యపనయతు విపన్నామధామాధిపస్య॥ ౫౪॥

మ॥ తిమిరారణ్యకృశానుకీలమొ, ద్యుభూదేశైక్యభిద్రత్నమో,।
తమియన్ దీవను ద్రెంచు గొడ్డలియొ, బోధప్రష్టయో లోకపుం।
గుమికిం, ప్రాక్సతి గాముల న్గ్రసుదము ల్గోయంగ మున్ జాచు హ।
స్తమొ, ధామాధిపయంత, యుష్మదఘశబ్దమ్ముల్ ద్రోలంగించెడున్॥ ౫౪॥

స్ర॥ పౌరస్త్యస్తోయదర్తోః పవన ఇవ పతత్, పావకస్యేవ ధూమో,।
విశ్వస్యేవాదిసర్గః, ప్రణవ ఇవ పరం పావనో వేదరాశేః।
సంధ్యానృత్తోత్సవేచ్ఛో రివ మదనరిపో ర్నాందినాందీ నినాదః।
సౌరస్యాగ్రే సుఖం వో వితరతు వినతానందనః స్యందనస్య॥ ౫౫॥

మ॥ పొగలాగగ్గికిఁ, దూర్పుగాలివలె మబ్బుంగారుకున్, బావనం।
బగు నోంకారము పోలికన్ శ్రుతికి, సంధ్యానర్తనాభ్యుద్యతా।
జగదిష్వాసికి నందినాందిగతి, సూక్ష్మంబున్బలె సృష్టిక।
గ్రగుఁడాదిత్యుని తేరికిచ్చు గరుడాగ్రప్రోద్భవుం డిష్టముల్॥ ౫౫॥

త్వము. ద్విజేశునకున్=గరుడునకు, చంద్రునకు. వేలాఘనతన్=ఈడున పెద్దతనముచే, కాలాధిక్యముచే. వీర్యాఢ్య=శక్తిచే మెచ్చఁదగిన. స్వతః=తన యొక్క. తోత్ర=చబుకు. స్తోత్ర=పొగడికగలవాఁడు. విడెడున్=రక్షించుగాక! తనున్=సూర్యుని. గ్రహాధీడ్యంత=(గ్రహరాజు) సూర్యుని యొక్క సారథి.

౫౪. తమి=రాత్రి. ప్రాక్సతి=తూర్పునంగన. గాములు=గ్రహములు. యుష్మ...బ్దమ్ముల్=మీపాపములను మూటలు సయితము.

౫౫. సంధ్యా.....ఇష్వాసికి=సంజయందలి తాండవమునకు సన్నద్ధుఁడైన (పినాకమను విల్లుగల) శివునకు. సూక్ష్మంబు=అపంచీకృతభూతములు. సృష్టికిన్=స్థూలప్రపంచ నిర్మాణమునకు. అగ్రగుఁడు=ముందుభాగమును పొందు. గరు.....ద్భవుఁడు=గరుడుని యన్న) అనూరుఁడు.

స్ర॥ పర్యాప్తం తప్తచామీకరకటకతటె శ్లిష్టశీతేతరాంశో।
రాసీదత్స్యందనాశ్వానుకృతిమరకతే పద్మరాగాయమాణః।
యస్సోత్కర్షాం విభూషాం కురుత ఇవ కులక్ష్మాభృదీశస్య మేరో।
రేనాంస్యహ్నాయదూరం గమయతుసగురుః కాద్రవేయద్విషోవః॥౪౬॥

మ॥ కడుమేల్తైఁడితటంబు వెల్గులబోసంగం గాఁచి, యందాకుడాల్।
పడుకుఱ్ఱేరి హయంబులోయనఁ దలిర్ప, న్నద్మబల్గెంపులా।
గడరుం దాఁగుల భూభృదీశునకు సాకారాహారముంగూర్పనా,।
నిడుమల్నెవ్వడి దవ్వగానిడు భుజంగేడ్ద్విడ్గురుండెప్పుడున్॥ ౪౬॥

స్ర॥ నీత్వాశ్వాంత్సప్తకక్ష్యా ఇవనియమవశం వేత్రకల్పప్రతోద।
స్తూర్ణంధ్వాంతస్యరాశా వితరజనఇవోత్సారితేదూరభాజి।
పూర్వంప్రోష్ఠోరథస్య క్షితిభృదధిపతీ న్దర్శయంస్త్రాయతాద్వ।
స్త్రైలోక్యాస్థానదానో ద్యతదివసపతేః ప్రాక్ప్రతీహారపాలః॥ ౪౭॥

మ॥ జగములన్నిటికిఁ గొల్వొసంగ, దినరాజ్యస్వామి, తత్స్యందనా।
గ్రగుఁడన్ప్రాక్ప్రతిహారి, సప్తహయ కక్ష్యల్పశ్వముల్సేసి, వే।
త్రగతిం దోత్రమెసంగ, నిర్లితర మర్త్యశ్రేణినాదూరగం।
బుగఁ బ్రాగ్దర్శిత భూభృదీశుఁడు భవన్మోద ప్రదుండయ్యెడున్॥ ౪౭॥

స్ర॥ పాశానాశాన్తపాలా దరుణవరుణతో మాగ్రహీః ప్రగ్రహార్థం।
తృష్ణాంకృష్ణస్యచక్రే జహిహినహిరథో యాతిమేనైకచక్రః।
యోక్తుంయుగ్యంకిముచ్చైశ్శ్రవసమభిలష స్యష్టమంవృత్రశత్రో।
స్త్యక్తాన్యాపేక్షవిశ్వప్రకృతిరితిరవి శ్శాస్తియంసోవతాద్వః॥ ౪౮॥

మ॥ అపరాధీశునిచేతిపో యరుణ యేలాప్రగ్గముల్పట్టు, నా।
సపదంబోకుము విష్ణుచక్రము, విశిష్టం బేకచక్రత్వమే,।
ద్యపవాహమ్మును బూన్ప నష్టమముగా యోచింపకం, బిట్లు ము।

౪౬. కులభూభృదీశునకున్ — మేరువను రాజవంశాధిపతికి. భుజం... గురుండు — (నాగరాజుల పగతుని) గరుడునియన్న.

౪౭. దినరాజ్యస్వామి — పగళ్లను సంస్థానమునకు దొర. ప్రాక్ప్రతిహారి — తూర్పును మొదటిద్వారము కాపరి. సప్తహయకక్ష్యలు — ఏడుగుఱ్ఱములను నేడుపహారాలు. వేత్రగతిన్ — బెత్తమురీతి. ఇర్లు — చీఁకట్లు. ఇతరమర్త్యశ్రేణి — చిల్లరమందిమూఁక. ప్రాగ్దర్శిత భూభృదీశుఁడు — ముందుచూపఁబడిన పెద్దకొండలను మహారాజులు గలవాఁడు.

క్తపరేచ్ఛాఖిల పార్శ్వయంత్రితుఁడు సూతశ్రేష్ఠుఁడిష్టంబిడున్॥ ౫౮॥

స్ర॥ వజ్రిన్జాతంవికాసీ క్షణకమలవనం భాసి, నోభాసివహ్నే।
తాతంనత్వాశ్వపార్శ్వం నయయమమహిషం, రాక్షసాపీక్షితారః।
వృష్టింసించప్రచేతః, పవనభుజజవం విత్తపావేదితస్త్వం।
వందేశర్వేతిజల్ప న్ప్రతిదిశమధిపా న్పాతుపూష్ణో౽గ్రణీర్వః॥ ౫౯॥

మ॥ కనుఁదమ్ము ల్వికసించె వజ్రి, తొలఁగెన్గాంతు ల్శిఖీ, కాలవా
హనము న్వాజుల ప్రక్కకున్నడుపు మయ్యన్ మ్రొక్కె, రాకాసి వీ।
క్షణమయ్యె, న్ఘనునాన్పు మోవరుణ, వేగంబాశుగా పొందు, నిన్।
వినుతున్విత్తప శర్వప్రమొక్కును, ఖరత్విడ్వ్యంత ప్రోచున్నిమున్॥ ౫౯॥

స్ర॥ నోమూర్చాభన్నవాంఛ శ్శ్రమవివశవపు ర్నైవనాప్యాస్యశోషీ।
పాన్థః పథ్యేతరాణి క్షపయతు భవతాంభాస్వతో౽గ్రే సరస్సః।
యస్సంశ్రిత్యత్రిలోకీ మటతిపటుతరై స్తప్యమానో మయూఖై।
రారాబారాను రేఖా మివహరితమణి శ్యామలా మశ్వపఙ్క్తిమ్॥ ౬౦॥

చ॥ తెరువరిప్రొద్దుముందు పడి తేఁగఁడు వెల్గులఁగ్రాఁగి, యాసవోఁ।
బారయక మూర్ఛ, మేనువశము న్విడకా, స్యము నెండకే గెడున్।
హరితమణిప్రభల్గురియు నశ్వసమూహపు రేఁతతోఁటచాల్।
దొరకుట నేతఁడా, పదలు తూలెడు మీకతనిన్భజించుటన్॥ ౬౦॥

స్ర॥ సీదన్తోన్త ర్నిమజ్జ జ్జడఖురముసలా స్సైన్సకతే నాకనద్యాః।
స్కందంతః కందరాళీః కనకశిఖరిణో మేఖలా సుస్థలన్తః।

---

౫౮. అప......చేటివి=(పడమటిదొర) వరుణుని హస్తమునందలివి. (ప్రగ్గములు పట్టునేలా) విశిష్టంబు=అతిశయముగలది. ద్యుపవాహమ్ము= స్వర్గరాజు గుఱ్ఱము. మోచింపకు=తలంపకు. ముక్త......యంత్రితుఁడు=ఇతరాపేక్షమాని యందఱను రక్షించుసూర్యునిచే నియమింపఁబడిన.

౫౯. వజ్రి=ఇంద్రా. శిఖీ=అగ్నీ. కాల=యమా. వాహనము=దున్నను. రాకాసి=నిరృతి. నాన్పుము=తడుపుము. ఆశుగా=వాయూ. వినుతున్=వినుపించెదను. విత్తప=కుబేరా. శర్వ=శివా. ప్రమొక్కు=దండము. ఖరత్విడ్వ్యంత=వేఁడివెలుఁగు సారథి.

౬౦. తెరువరియేతఁడు=ఏపథికుఁడు. ప్రొద్దుముందు = సూర్యునెదుట. పొరయక మూర్ఛ=మూర్ఛిల్లక. హరిత...చాలు= మరకతరత్నకాంతులు భ్రమించు గుఱ్ఱములగుంపను లేఁదోఁటలవరుస.

దూరందూర్వాస్థలోత్థా మరకతదృషది స్థాస్నవోయన్న యాతాః।
పూష్ణోశ్వాఃపూరయన్త్య స్తదవతు జవనై ర్ఘ్రాంకృతేనాగ్రగోవః॥ ౬౧॥

మ॥ చరణంబుల్దిగఁజాఱి మేలుగుహాలన్, స్వర్వాహినీసైకతాం।
తరమజ్జన్మ సలత్థురాంచల జడత్వప్రాప్త ఖేదంబులై।
హరిదశ్మస్థలి, దూర్వలన్భ్రమముచే నర్కాశ్వము ల్మేఁయ్వను।
త్త్వర ధేయంచు నదల్చు నేతఁడదినింపన్ద్రాతమీకాతఁడే॥ ౬౧॥

ఇత్యనూరువర్ణనమ్.

అథ రథవర్ణనమ్.

స్ర॥ పీనోరఃప్రేరితాభ్రై శ్చరమఖురపుటాగ్రస్థితైః ప్రాతరద్రా।
వాదీర్ఘాంగై రుదస్తో హరిభిరపగతా సంగనిశ్శబ్దచక్రః।
ఉత్తానానూరుమూర్ధ్నా వనతిహఠభవ ద్విప్రతీపప్రణామః।
ప్రాహ్ణేశ్రేయోవిధత్తాం సవితురవతర న్వ్యోమవీధీంరథోవః॥ ౬౨॥

మ॥ పెనుగా ల్గిట్టలయంచులన్నిలిచి ప్రాక్పృథ్వీధ్రమందశ్వముల్।
పెనుతోమ్ముల్విదుర్పన్మొగిళ్ళఁ దనుపుర్వ్యేలన్గడున్వ్రాచిరో।
త్తను, దౌలెందును లేమినూవయరి నుత్తానుం డనూరుండు మూ।
ర్ధనతిన్వింతగ మ్రొక్క వేగఁ జను తేర్సౌరమ్ము మిమ్మేలెడున్॥ ౬౨॥

స్ర॥ ధ్వాంతౌఘధ్వంసదీక్షా విధిగురువహతా ప్రాక్సహస్రంకరాణాం।
మర్యమ్ణాయోగరీయః పదమతులముపాసీయతా ధ్యాసనేన।
సశ్రాంతానాం నితాంతం భరమివమరుతా మత్తుమశ్వానాంవిసోఢుం।
స్కంధాత్కంధంప్రజన్వో వృజినవిహతయే భాస్వతస్స్యందనోస్తు॥ ౬౩॥

మ॥ కరసాహస్రము ధ్వాంతభంగ గురుదీక్షా బంధురంబొప్ప భా।
స్కరుఁడెక్క న్వహియింపలే, కతిభరాక్రాంతి న్గడున్డస్సె న।

---

౬౧. స్వర్వా.....ఖేదంబులై=మిన్నేటి యిసుకతిన్నెలఁ దిగఁబడు రోకళ్ళవంటి గిట్టలకొనల చులుకు లేమి నలసినవియై. హరిదశ్మస్థలి=ఆకుపచ్చ రతనముల నేల. ఉత్త్వరన్=అతివేగముచే. నింపన్=పూరించుటకు. త్రాత=రక్షకుఁడు.

౬౨. గిట్ట=డెక్క. ప్రాక్పృథ్వీధ్రమందున్=ఉదయాద్రిని. పెను=విశాలమునైన. విదుర్పన్=చెదరగొట్టఁగా. మొగిళ్ళన్=మబ్బులను. తౌలు=తగులుట. మూవయరిన్=ధ్వనిలేని చక్రముతో. ఉత్తాన=వెల్లకిలఁబడిన. మూర్ధనతిన్=తలయొక్క (వెనుకకు) వంచుటచేత. వేగన్=ప్రాతఃకాలమున. సౌర=సూర్యునిది.

న్గరుణాపూర్ణత నాఁభజించెడు మరుత్స్కంధంబు వేఱొండెదా।
యరథంబామయ దావవారిదము మీకార్తిచ్ఛిదాపాదియౌ॥ ౬౩॥

స్ర॥ యోక్త్రీభూతాన్త్రిథస్య గ్రసితుమివపురో దందశూకాన్దధానో।
ద్వేధావ్యస్తాంబువాహావళివిహితబృహత్పక్షవిక్షేపశోభః।
సావిత్రస్స్యందనోసౌ నిరతిశయరయ ప్రీణితానూరురేనః।
క్షేపీయోయోగరుత్మా నివహరతుహరీచ్ఛావిధేయప్రచారః। ౬౪॥

మ॥ హరివాంఛావశసంప్రచార మతిరంహఃప్రీణితానూరువుఁ।
న్దరణిస్యందనమేది యగ్రమున యోక్త్రీవ్యాళము ల్మ్రింగ నాఁ।
బరగం బాయలువడ్డ మేఘవితతు ల్పత్త్రంబులొప్ప వి।
ష్ణురథంబోయన మించునయ్యది కొలల్ శోధించి తూలించెడుఁ॥ ౬౪॥

స్ర॥ ఏకాహేనైవదీర్ఘాం, త్రిభువనపదవీం లంఘయన్యోలఘిష్ఠః।
పృష్ఠేమేరోర్గరీయా న్దలితమణిదృష త్త్వింషిపింషంచ్ఛిరాంసి।
విశ్వస్యైవోపరిష్టా దపిచపునరధ స్తాదివాస్తాద్రిమూర్ధ్ని।
బ్రధ్నస్యావ్యాత్సజాతో దురధిగమపరి స్పందనః స్యందనోవః॥ ౬౫॥

మ॥ సులువెంతేనొకనాఁట మజ్జగముల న్సొంపారలంఘించుటఁ।
బలువెంతే గనకాద్రిశృంగముల రత్నమ్ముల్నలంగించుటఁ।
వెలయున్లోకముపైనొ యస్తశిఖరోర్విం దద్దయుం గ్రిందనో।
విలసిల్లున్రవితేరమేయగతి దుర్విద్యల్తొలంగించెడుఁ॥ ౬౫॥

---

౬౩. కర...స్రము=వెలుఁగులను వేయిచేతులు. ధ్వాం......రంబు=చీకటి నడఁచుటయందు గొప్ప(బరువైన) నియమముతో నొప్పునవి. ఒప్పు=కలుగు. ఏది=ఏరథము. వేఱొండు మరుత్స్కంధము=(ఆవహాది సప్తవాయుస్కంధములలో నొకదానిని విడిచి) మఱియొకవాయువు (గణమును) మూఁపును.

౬౪. ఏది తరణిస్యందనము=ఏసూర్యరథము. విష్ణురథంబు=గరుడియోయన. (హరి)...చారము=(గుఱ్ఱముల, విష్ణువుయొక్క) ఇచ్ఛకులోఁబడిన నడకగలది. అతి...అనూరువును=అతివేగముచే సంతసింపఁజేయఁబడిన (సారథి, అన్న) అరుణుఁడుగలదియు. అగ్ర.....బరగన్=ఎదుట (పగ్గములగు, పగ్గములవంటి) పాములుతినుటకో యననొప్పఁగా. కొలలు=పాపములు.

౬౫. ఎంతేనిసులువు=లఘుతమము. ఎంతేనిబలువు=అన్నిటికంటె గురుతమము. వెలయు...పైనొ=(ఉదయము మొదలు) ప్రపంచమునకు మీఁదిదివ లెను. అస్త......విలసిల్లున్=అస్తాభిముఖ్యమున మిక్కిలి క్రిందిది వలెను. అమేయగతి=సులువుబలువుమీఁదిది, క్రిందిదియని నిర్ణయింపరాని నడకగలది. దుర్విద్యలు=భ్రమములు. [సశేషము.]

జంతుస్వభావచరిత్రము. (౩౬౬-పుట శేషము.)

కుక్క.

లోకములోని సమస్తజంతువులలోను కుక్క మనుష్యుని యెడల మిక్కిలి విశ్వాసముకలదియు మిక్కిలి యుపయుక్తమయినదియు నయియున్నది. ఇతరజంతువులు తమప్రయోజనము నపేక్షించి భయముచేత మనుష్యుని సేవచేయును. కుక్క మాత్రము స్వప్రయోజనమును జూచుకొనక తనదేహప్రాణములను రెంటిని యజమానుని కర్పించి సేవించుచు. కళ్ళెముతీసి పెంపుడు గుఱ్ఱమును స్వేచ్ఛగా బయల విడువఁగానే యది యపరిమిత సంతోషమును గనఁబఱుచును. కుక్కచేత నెంత యెక్కువపని చేయించివిడిచినను సంతోషించి తన దారినిబోక యది యజమానుని ననుసరించి వెంటఁబడును. దానికి యజమానునియొద్దనుండి యాతని సేవచేయుచున్నప్పటికంటె నెక్కువ సంతోషము మఱియెప్పుడునుండదు. కుక్కలలో ననేక జాతులుగలవు. నానాజాతుల కుక్కలు నానావిధకార్యముల కుపయోగపడును. వానిలోఁగొన్ని ముఖ్యములయిన జాతులనుగూర్చి మాత్రమిందుఁ గొంతవివరింపఁబడును.

కుక్కజాతిలో నెల్లను జోడంగికుక్క మిక్కిలి వేగముగా పరుగెత్తును. దాని కాళ్లు సన్నముగా పొడుగుగానుండును; ఱొమ్ము వెడల్పుగానుండును; మూతినిడుపై యంతకంతకు సన్నముగా మొనతేలి యుండును. జోడంగికుక్క రూపమీప్రక్క



పటమువలనఁ దెలియవచ్చును
ఇది లేడికంటెను గుఱ్ఱముక
టెను కుందేలుకంటెను అధిక
వేగముతో పరుగెత్తఁగలదు
అయినను కుందేలు మిక్కి
చిన్నదగుటచేత జోడంగి మహ
వేగముతో తఱుముకొనివచ్చు
చున్నప్పుడు తటుక్కున
క్కకు మరలి కుక్క పెద్దపె
యంగలువేసి యురువడిచే
ముందుకుపోయి మరలులోప

తప్పించుకొని పోవుటగలదు. జోడంగిని సాధారణముగా కుందేటివేటయందు

యోగింతురు. ఈకుక్క తనవేగమునకు తగినంత సాహసముకలదికాకపోవుటచేత దీనినెద్దు కుక్కలతోఁ గలిపి యీరెండు గుణములునుగల పిల్లలను దింపుదురు. ఇది కేవలదృష్టి చేతనే కానిపసిపట్టిపోయి వేటాడనేరదు.

ఈప్రక్కను వేయఁబడినకుక్క నీరాటకుక్కయనఁబడును. జలమునందధిక ప్రీతికలదగుటచేత దీనికీపేరు కలిగినది. ఇది మొట్టమొదట నమెరికాఖండములోని న్యూఫౌండు లాండు దేశమునుండి తీసికొని రాఁబడిన దగుటచేత దీనికి న్యూఫౌండులాండు కుక్కయనియు పేరు గలదు. ఇది బలమయిన పెద్దకుక్క యగుటచేత స్వదేశమునందు బండ్లు లాగుటమొదలైనపనుల నిమిత్తముపయోగింపఁ బడును. ఉప్పునీటిలోఁ గాని తియ్యనీటిలోఁ గాని పడి యీఁదులాడుచు కొట్టుకొనుచున్నప్పుడు దీనికెంతో సంతోషము. ఇది నీటిలో



మునిఁగిచాలసేపుండును; నీటిలోపడవేసి యజమానుఁడు తెమ్మన్నవస్తువును నిమిషములో తెచ్చును. ఈకుక్కలు నీటిలోమునిఁగి నీళ్ళుత్రాగి యీఁదలేక గుటకలు వేయుచు కొట్టుకొనుచున్నమనుష్యులప్రాణము లనేకములుకాపాడినవి. ఇవి మునిఁగి పోయెడుమనుష్యుని బుజములవద్దఁగాని మెడవద్దఁగాని పట్టుకొని తలనీటిపయికుండు నట్లుచేసియొడ్డునకుఁదీసికొనివచ్చును. ఈజాతికుక్కలకు తమ యజమానులయందు మాత్రమేకాకమనుష్యజాతిమీఁద నెల్లను ప్రేమకలదు. కాఁబట్టి యివి తామదివఱ కెన్నఁడును జూడనిమనుష్యునినైనను కష్టములోనున్నప్పుడు తమ యజమానుని యాజ్ఞయక్కఱలేకయే సర్వవిధముల తోడుచూపి కాపాడును.

మఠపుకుక్కయని యిటువంటిదే యింకొక పెద్దజాతి కుక్కయూరపుఖండము


సందుఁగలదు. దీనినే సెంటుబర్నార్డుకుక్కయందురు. ఈకుక్కలు మిక్కిలి చలిదేశములో పుట్టిపెరిగినవయి మంచులో తిరుగుట కలవాటుపడి మంచువానలచేత దారితప్పినట్టిగాని మార్గాయాసముచేత సొమ్మసిల్లిపడి మంచులోఁ బూడినట్టిగాని మార్గస్థులను వెదకి రక్షించుటయందు మిక్కిలి ప్రసిద్ధికెక్కినవి. సెంటుబెర్నార్డుమఠముతోఁ జేరిన క్రైస్తవసన్యాసులు వీనిని పెంచి గాలివానలు పట్టినప్పు డెల్లను శ్లాఘనీయమయిన యీపనికిఁ బంపుచుందురు. అప్పుడివి యపాయకరములైన స్థలములయందెల్లను తిరిగి మనుష్యుఁడు పూర్ణముగా మంచులోఁ బూడిపోయియున్నను, అత్యద్భుతమయిన తమవాసనాశక్తివలన పసిపట్టి తెలిసికొని యపాయసూచకముగా పర్వతగుహలు మాఱుమ్రోయునట్లు మొఱుగుచు శవప్రాయుఁడయి పడియున్నవాని మీఁది మంచంతయు కాళ్ళతోఁ గోకివేసి యాభాగ్యహీనునిఁ బయికితీయును. కుక్కల కూతవినఁబడఁగానే మార్గస్థుఁ డెవ్వఁడో ప్రాణాపాయదశలో నున్నాఁడని తెలిసికొని యాసన్యాసులు వెంటనే బయలుదేఱిపోయి తగినతోడ్పాటును జూపి యనన్యగతికుఁడయిన యాపాంథుని ప్రాణమురక్షింతురు. ఈసన్యాసులు విపన్నజనరక్షణార్థముగా తమకుక్కలను బంపునప్పుడు మార్గస్థులకు పెట్టచేయుటకుఁ దగినపదార్థములను వానిమెడకుఁగట్టి పంపుటయుఁ గలదు. అగతికులయి మంచులో మునిఁగి చావవలసినమార్గస్థులనేకులీప్రకారముగా ప్రతిసంవత్సరమును ఈకుక్కలమూలమున బ్రతుకుదురు.

జాగిలపుజాతి వేఁటకుక్కలలోఁ జేరినది నెత్తురుజాగిలమనఁబడుకుక్కయొకటి గలదు. రక్తమునందధికప్రీతికలదగుటచేత దీనికీపేరుకలిగినది. ఇదిగాయపడిన లేడి మొదలయిన జంతువులను మహారణ్యములో నెన్నియిఱుకుసందులలో నెన్నివంపులు తిరిగిపాఱిపోయినను నెత్తురునుబట్టి జాడతీసిపట్టుకొనఁగలదు. దీనికి ఘ్రాణేంద్రియము బహుసూక్ష్మమయినదగుటచేత దీనితో సమానముగా పసిపట్టఁగల జంతువు మఱియొకటిలేదు. పూర్వకాలమునందు దొంగలను పాఱిపోయినసేవకులను పట్టుకొనుటయందు దీని నుపయోగించు వాడుకయుండెను. పాఱిపోయినవాని బట్టయొకటి వాసనచూపినపక్షమున పాఱిపోయినవాఁడు తనకంటె జాముసేపు ముందుగా బయలుదేఱినను నేలవాసనచూచుచు నూఱులకొలఁది యడుగుజాడలలో వాని యడుగు జాడ తెలిసికొని యెంతదూరమునైనఁబోయి వానిని తప్పకపట్టుకొనును. నీటియందు వాసన నిలువదు కాఁబట్టి పాఱిపోయినవాఁడు ప్రవాహజలములోదిగి కొంతదూరమునడిచి తప్పించుకొనిపోయినప్పుడుమాత్ర మీకుక్క యట్టిమనుష్యుని

పట్టుకొనుటకు శక్తిలేనిదగును. ఈ జాతికుక్కలకు కోపమధికమగుటచేత యజమానులుతప్ప నితరులు దీనిజోలికి పోరాదు. రక్తమునందు నెత్తురుజాగిలమునకధిక ప్రీతియగుటచేత నిదియొక జంతువును వేటాడినప్పుడు దానిరక్తమాంసములతో ముందుగాతానుతృప్తి పొందువఱకును యజమానునినైనను దఱిఁజేరనియ్యదు. ఈనెత్తురు జాగిలముయొక్క తల ఈప్రక్క పటమునందుఁ జూపఁబడి యున్నది.



ఈజాతిలోఁజేరిన కుక్కలు తామువేటాడు వివిధజంతువులనుబట్టి నక్కలజాగిలము మొదలయిన వివిధనామములతో వ్యవహరింపఁబడుచున్నవి. ఇవి మిక్కిలి వేగముగా బహుదూరము పరుగెత్తఁగలవు. లేడిజాగిలమొకటి యొకదుప్పినితఱుముకొని యొకప్పుడేఁ బదిమైళ్ళదూరము పరుగెత్తినది. పూర్వమొకప్పుడు పందెపుగుఱ్ఱములతో నీజాతికుక్కలను పరుగెత్తించినప్పుడు వానిలో నొకకుక్క రెండు క్రోసులదూరమెనిమిదినిమిషములలోఁ బరుగెత్తినది. పందెపుగుఱ్ఱములలో మిక్కిలి వేగముగలది మాత్రమీకుక్కకంటె నర్ధనిమిషము ముందుగా గమ్యస్థానము చేరినది. ఈ ప్రక్కపటములోఁజూపఁబడినది నక్కలబెదరింపుగాఁడనఁబడును.



[సశేషము.]

కం. వీరేశలింగము.